ముంజలు కొంటుండగా..
కబళించిన మృత్యువు

- కారు ఢీకొని తల్లీ కొడుకు మృతి
- బూడిదంపాడు వద్ద ఘటన
- మృతులు జాస్తిపల్లి వాసులు



6

నిరుపేద, మధ్య తరగతి యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాస పథకం మార్గదర్శకాలపై స్పష్టత లేకపోవడంతో దరఖాస్తుదారులు గందరగోళానికి గురవుతున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు బ్యాంకర్లకు రాకపోవటంతో సిబిల్ చిక్కుముడి వీడటం లేదు. రాజీవ్ యువ వికాసానికి సిబిల్ స్కోర్ అవసరం లేదని డిప్యూటీ సీఎంతోపాటు ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయిలోని అధికారులు పక్షం రోజుల క్రితమే ప్రకటించారు. కానీ ఆ ఆదేశాలు, నూతన మార్గదర్శకాలు ఇంకా బ్యాంకర్లకు చేరకపోవటంతో రాజీవ్ యువవికాసం సిబిల్ చిక్కుముడి వీడటం లేదు. అంతేకాకుండా గతంలో స్వీకరించిన దరకాస్తులను మళ్లీ బయటకు తీసి పునఃపరిశీలన చేసి ప్రతి దరఖాస్తుకు ఆధార్‌నెంబర్, సెల్ నెంబర్‌లను జత చేసి మెప్మా అధికారులు బ్యాంక్లరకు ఆన్‌లైన్ చేస్తున్నారు. దీంతో రాజీవ్ యువ వికాసం రుణాల పంపిణీలో మరింత జాప్యం జరుగుతోంది.





దరఖాస్తులను వేరు చేస్తున్న మెప్మా సిబ్బంది

వీడని సిబిల్ చిక్కుముడి

- రాజీవ్ యువ వికాసానికి సిబిల్ స్కోర్ అవసరం లేదని డిప్యూటీ సీఎం ప్రకటన
- క్షేత్రస్థాయిలో బ్యాంకర్లకు చేరని ప్రభుత్వ మార్గదర్శకాలు
- ప్రతి దరఖాస్తు పునఃపరిశీలన, ఆధార్, సెల్ నెంబర్ల లింక్
- రుణాల మంజూరులో మరింత జాప్యం

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 25 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుపేదలకు మధ్య తరగతి వారికి ఉపాధి కల్పించేందుకు రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు రాజీవ్‌యువ వికాసం రుణాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకానికి ఖమ్మం జిల్లాలోనే అత్యధికంగా ఖమ్మం నగరంలో దరఖాస్తులు అందాయి. నగరంలోని 60 డివిజన్లలో మొత్తం 16,061 దరఖాస్తులను మెప్మా అధికారులు స్వీకరించారు. వాటిలో ఎస్సీ 3,213, ఎస్టీ 872, బీసీ 8,127, ఈబీసీ 770, ముస్లిం మైనారిటీలు 3,043, ఎస్సీ మైనార్టీ 36 దరఖాస్తులు అందాయి. వాటిని మే మొదటి వారంలోనే మెప్మా అధికారులు ఆన్‌లైన్ చేశారు.

ప్రకటనకే పరిమితమా..

బ్యాంకర్లు ఎటువంటి రుణాలు ఇవ్వాలన్నా.. మొదట సిబిల్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు బ్యాంకులకు వెళ్లిన తర్వాత సిబిల్ స్కోర్ కావాలని బ్యాంకర్లు ఆయా దరఖాస్తులను అమోదించలేదు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా దీనిపై చర్చ జరిగింది. దీనిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో అధికారులతో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. రాజీవ్ యువ వికాసానికి సిబిల్ స్కోర్ అవసరం లేదని ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయింపు చేసి ఆ డబ్బులను బ్యాంకర్ల ద్వారా రాజీవ్ యువ వికాసానికి పంపిణీ చేస్తోందని స్పష్టత ఇచ్చారు. కానీ జీవో రూపంలో అది అమలు కాలేదు. ఆ ఆదేశాలు బ్యాంకర్లకు చేరలేదు. దీంతో మెప్మా అధికారులు మళ్లీ రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను బయటకు తీసి సిబిల్ స్కోర్ కోసం ఆధార్, సెల్ నెంబర్లను జత చేసి తిరిగి బ్యాంకు ఆన్‌లైన్ చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలోని అధికారులు స్పందించి బ్యాంకర్లకు సిబిల్ స్కోర్‌పై జీవో విడుదల చేస్తే రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు సిబిల్ కష్టాలు తొలగిపోతాయి. సిబిల్ స్కోర్ పరిగణించకుండా రాజీవ్‌యువ వికాసం రుణాలు ఇవ్వాలని కోరుతున్నారు.

సిబిల్ స్కోర్‌తో నిరుపేదలకు రుణ గండం

డిజిటల్ లావాదేవీలు వచ్చిన తర్వాత సెల్‌ఫోన్ ఉన్న ప్రతీ ఒక్కరికి నిరుపేదల నుంచి ధనవంతుల వరకు ప్రతి వస్తువును కొనుగోలుకు రుణాలపై ఆధారపడితున్నారు. ఈ క్రమంలోనే గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు సైతం మైక్రోఫైనాన్స్ సంస్థలు సెల్‌ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్లను ఆసరాగా చేసుకొని రుణాలను అందించారు. ఈ క్రమంలో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు తేడా లేకుండా ప్రతి చిన్న చితకా రుణాలు పొందిన వారు సైతం సరైన సమయానికి తిరిగి చెల్లింపులు చేయకపోవటంతో సిబిల్ స్కోర్ ప్రభావానికి గురైన వారు 70శాతం మేర ఉంటారు. ఈ నేపథ్యంలో రాజీవ్ యువ వికాసానికి సిబిల్ స్కోర్ ప్రామాణికం కాకుండా రుణాలను మంజూరు చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

20 పడకలతో
కొవిడ్ వార్డు

- ఖమ్మం జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటుకు సన్నాహాలు
- నేడు కొవిడ్ కమిటీ ఏర్పాటు ?
- వైరస్ పెరుగుతోందన్న ప్రచారంతో అధికారుల చర్యలు



ఖమ్మం కలెక్టరేట్, మే 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కొవిడ్ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ వైద్యవిద్య డైరెక్టరేట్ నుంచి ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో ఖమ్మం జిల్లా ఆస్పత్రి అధికారులు అప్రమత్తమయ్యారు. ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేకంగా కొవిడ్ వార్డును ఏర్పాటు చేయాలని ఆదివారం సాయంత్రం డీఎంఈ నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. దీంతో సోమవారం ఆస్పత్రి అధికారులు ఆయా వైద్య విభాగాల సిబ్బందితో సమీక్షించ నిర్వహించనున్నట్లు తెలిసింది. పల్మనాలజీ వార్డులో 20 పడకలతో ప్రత్యేక కొవిడ్ వార్డును ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. దీనికి జనరల్ మెడిసిన్ వైద్యుల సమక్షంలో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. అత్యవసర వైద్య వసతులు ఉన్న 20 బెడ్లతో స్పెషల్ వార్డును ఏర్పాటు చేస్తున్నారు. కొవిడ్ పరీక్షలకు ఇప్పటికీ కిట్లు ప్రత్యేకంగా లేకపోయినా త్వరలో వీటిని కూడా సమకూర్చుకోనున్నట్లు తెలిసింది. కొవిడ్ లక్షణాలతో వచ్చే పేషెంట్లకు ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించేందుకు వైరాలజీ ల్యాబ్ పక్కన వార్డులో ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. మొత్తంగా కొవిడ్ కేసులు పెరిగినా అధిగమించేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. నేడు జిల్లా ఆస్పత్రిలో జరిగే ప్రత్యేక సమావేశంలో మరింత సమాచారం అందనుంది.



జీపీవో పరీక్ష పత్రాలను కేంద్రానికి తరలిస్తున్న దృశ్యం

ప్రశాంతంగా 'గ్రామపాలన అధికారి' పరీక్ష

- 225 మంది అభ్యర్థుల హాజరు
- పరిశీలించిన నోడల్ అధికారి పద్మశ్రీ

6



ఖమ్మంలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న మహిళలు

ఉప్పొంగిన మహిళా తరంగం

- బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ
- 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని హర్షిస్తూ నగరంలో భారీ కవాతు

6

పచ్చిరొట్ట విత్తనాల
పంపిణీలో జాప్యం

- వర్షాలు మొదలవ్వడంతో ముమ్మరంగా మెట్ట దుక్కులు
- జీలుగు విత్తనాల కోసం రైతుల ఎదురుచూపులు
- అదును దాటి పోతోందని ఆందోళన

కల్లూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వ్యవసాయ సీజన్‌లో తొలకరి వర్షాలు ముందుగానే కురుస్తున్న నేపథ్యంలో రైతులు వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో వరి సాగు చేసే రైతులు తమ పొలాల్లో ముందుగా పచ్చిరొట్ట పెంచారు. కానీ సహకార సంఘాల ద్వారా ఇంకా పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులోకి రాకపోవడంతో అదును దాటిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సారి వాతావరణం కూడా అనుకూలంగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్పడంతో వానాకాల వ్యవసాయ సీజన్ పనులు ప్రారంభించటంలో కల్లూరు మండలానికి చెందిన రైతులు ముందంజలో ఉన్నారు. సాగర్ జలాలు పుష్కలంగా అందుబాటులో ఉండటంతో ఈ ప్రాంత రైతులు వానకాలం, యాసంగి పంటలు ఒక అడుగు ముందుగానే సాగు చేస్తారు. ఇలా రెండు పంటలు సాగు చేయటంతో భూముల్లో భూసారం తగ్గుతుంది. కల్లూరు మండలానికి చెందిన పలు గ్రామాల రైతులు తమ భూముల్లో భూసారం పెంచేందుకు పచ్చి రొట్ట సాగు చేస్తారు. వ్యసాయం సాగులో ప్రధానంగా వరి పంట ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కల్లూరు మండలం అగ్రగామిగా నిలిచింది. ఇక్కడ రెండు పంటలుగా సుమారు 33,350 ఎకరాల్లో వరి సాగవుతుంది. ఇటీవల కాలంలో వానాలు అడపాదడపా కురవటంతో భూముల్లో తేమ పెరగడంతో రైతులు పచ్చి రొట్ట సాగుకు దుక్కిలు దున్ని పొలాలను సిద్ధం చేశారు. ఇలా దుక్కి దున్నిన పొలాల్లో పచ్చి రొట్టగా జీలుగు, పిల్లిపెసర విత్తనాలు చల్లితే 15నుంచి 20రోజుల్లోనే మొలక కట్టి ఏపుగా పెరుగుతాయి. ఆ పచ్చి రొట్టను కలియ దున్నితే భూసారం పెరుగుతుంది. వరి నార్లు పోసిన రైతులు నాట్లు వేసేందుకు సిద్ధం అవుతారు.

వాస్తవంగా మే 15 నుంచి 20వ తేదీ లోగా రైతులకు జీలుగు విత్తనాలు ప్రభుత్వం తరుఫున అందితే ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనం చల్లటం జరిగేది. కానీ దుక్కిలు దున్ని సిద్ధంగా ఉన్న (మిగతా 6వ పేజీలో)



చెన్నూరులో ట్రాక్టర్‌తో పొడిదుక్కి దున్నుతున్న రైతు

రాముడు అందరి వాడు

- ఆయన దగ్గరకు రావడమంటే ప్రజాస్వామ్యం దగ్గరకు వెళ్లినట్లే..
- ఐదు పంచాయతీల సమస్య ఇద్దరు సీఎంలకు వివరిస్తా
- రాజ్యాంగ పరిరక్షణ సదస్సులో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్
- భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్సీ దంపతులు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

భద్రాచలం, మే 25(ఆంధ్రజ్యోతి): రాముడు అందరి వాడని, కానీ కొందరు రాముడిని, జైశ్రీరామ్ నినాదాన్ని తమ సొంతంగా భావిస్తున్నారని ఎమ్మెల్సీ డా.అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. రామ రాజ్యం చరిత్రలో ఆదర్శప్రాయంగా నిలిచిందని, దీంతో రాముని జీవితం ఆదర్శంగా ఉందన్నారు. అలాగే అంబేద్కర్ జీవితం సైతం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. భద్రాద్రి రామాలయంలో తాను రామయ్యను దర్శించుకున్నానంటే అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే సాధ్యమైందన్నారు. రాముడు నడయాడిన ఈ ప్రాంతం పుణ్యభూమి అని ఇక్కడ జన్మించిన వారంతా ఎంతో అదృష్టవంతులని వ్యాఖ్యానించారు. భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన భారత రాజ్యాంగం పరిరక్షణ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాముడు అందరి వాడని, ఆయన దగ్గరకు రావడం అంటేనే ప్రజాస్వామ్యం దగ్గరకు రావడంతో సమానమని పేర్కొన్నారు. మన రాజ్యాంగం హైందవ ధర్మానికి దూరంగా ఉండదన్నారు. 70శాతం రాజ్యాంగంలో హిందూ సనాతన ధర్మాలు ఉంటాయన్నారు. రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత అని పేదోడి ఆకలి తీర్చిన వాడే నిజమైన నాయకుడు అని ఎమ్మెల్సీ దయాకర్ పేర్కొన్నారు. సమానత్వం భారత రాజ్యాంగంతోనే సాధ్యమన్నారు. హిందువులు భగవద్గీత, ముస్లింలు ఖురాన్, క్రిస్టియన్‌లకు బైబిల్ ఎలాంటిదో భారతీయులకు భారత రాజ్యాంగం అలాంటిదన్నారు. ఏపీలో విలీనమైన ఐదు పంచాయతీలు తిరిగి తెలంగాణలో కలపాలని కోరడం న్యాయమైన కోరిక అన్నారు. ఈ అంశాన్ని రెండు రాష్ట్రాల సీఎంలు, మంత్రుల దృష్టికి మీ గొంతుకగా తీసుకెళ్తానన్నారు. అంబేద్కర్‌లా ఉండనక్కర్లేదని ఆ మహనీయున్ని అనుసరిస్తే చాలన్నారు. ఆకాశంలో సగంగా ఉన్న మహిళలను అన్ని విధాల ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమాల్లో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, నాయకులు భాస్కర్, తోటమల్ల రమణమూర్తి, చింతిరేల రవికుమార్, బోళ్ల వెంకటేశ్వర్లు, దశంబాబు, తోటమల్ల సురేష్ పాల్గొన్నారు.

'ఆర్టీఐ'ని సద్వినియోగం చేసుకోవాలి

- ప్రతి మనిషికి సహకార గుణం ఉండాలి
- ఆర్టీఐ రాష్ట్ర కమిషనర్ పీవీ శ్రీనివాస్
- కొత్తగూడెంలో ఆత్మీయపౌర సన్మానం



కొత్తగూడెంలో జరిగిన ఆత్మీయ పౌర సన్మాన సదస్సులో మాట్లాడుతున్న ఆర్టీఐ రాష్ట్ర కమిషనర్ పీవీ శ్రీనివాస్

కొత్తగూడెం, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీఐ చట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకుని సమాచార హక్కును పొందాలని ఆర్టీఐ రాష్ట్ర కమిషనర్ పీవీ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మనిషి తోటివారికి సహాయం చేసే గుణం ఉండాలన్నారు. జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగూడెంలోని లక్ష్మీదేవిపల్లిలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో ఆర్టీఐ కమిషనర్ శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి వివాదాలకు పోకుండా ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఆర్టీఐ చట్టం ద్వారా సమగ్ర సమాచారాన్ని పొందవచ్చన్నారు. చట్ట ప్రకారం ప్రతి పౌరుడికి సమగ్రంగా సమాచారాన్ని పొందే హక్కు ఉందన్నారు. ఈ విషయాల్లో అటు ప్రభుత్వ అధికారులు కానీ ఇటు పౌరులు కానీ ఎలాంటి వివాదాలకు వెళ్లకుండా ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. సమాజం పట్ల పౌరులు అంకితభావంతో ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. కమిషనర్ శ్రీనివాస్ సతీమణి సృజన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంతో నమ్మకంతో ఆర్టీఐ రాష్ట్ర కమిషనర్‌గా శ్రీనివాస్‌ను నియమించారని, తప్పనిసరిగా శ్రీనివాస్ వందకు వంద శాతం అంకితభావంతో పని చేస్తారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడెం పౌరసమాజం తమను ఘనంగా సత్కరించడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో...

కొత్తగూడెం జర్నలిస్టుల సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీఐ కమిషనర్‌గా నియమితులైన జర్నలిస్టు పీవీ శ్రీనివాస్‌ను వివిధ జర్నలిస్టు సంఘాలు, వివిధ ప్రజాసంఘాలు, తెలంగాణ వాదులు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాస్ దంపతులకు ఘనంగా శాలువాలతో సత్కరించి పూలమాలలతో సన్మానించి మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు దుద్దుకూరి రామారావు, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ఈమంది ఉదయ్‌కుమార్, టీయూడబ్ల్యూజే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కల్లోజు శ్రీనివాస్, సింగరేణి జీఎం ఎడ్యుకేషన్ గుండా శ్రీనివాస్, మాజీ జడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, కాంగ్రెస్ నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు జేవీఎస్. చౌదరి, కోనేరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్

రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పీవీ శ్రీనివాస్ కొత్తగూడెం జిల్లాకు వచ్చిన సందర్భంగా ఇల్లెందు సింగరేణి అతిథిగృహంలో ఆదివారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు కలెక్టర్ మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



వెండి పళ్లెం అందజేస్తున్న దృశ్యం

రామయ్యకు వెండి పళ్లెం

» అందజేసిన భీమవరం భక్తులు

భద్రాచలం, మే 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి ఏపీలోని భీమవరానికి చెందిన భక్తులు భాస్కర్‌ రావు లక్ష్మీ పద్మావతి దంపతులు వెండి పళ్లేన్ని అందజేశారు. ఆదివారం దేవస్థానం పర్యవేక్షకులు కత్తి శ్రీనివాసరావు చేతుల మీదుగా వెండి పళ్లేన్ని దాత భాస్కర్‌రావు అందజేశారు. ఈ వెండి పళ్లెం 460 గ్రాముల బరువు ఉండగా దాని విలువ రూ.43,700 ఉంటుందని దేవస్థానం వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్‌, అర్చకులు సౌమిత్రి శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న ఆర్‌టీఐ కమిషనర్‌ శ్రీనివాసరావు



ఆలయంలో ఆర్‌టీఐ కమిషనర్‌

భద్రాచలం/ కూసుమంచి, మే 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని రాష్ట్ర సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) కమిషనర్‌ పీవీ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆదివారం భద్రాచలం రామాలయంకు వచ్చిన ఆయనకు దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అనంతరం స్వామి వారి కండువా ప్రసాదంను దేవస్థానం వైదిక సిబ్బంది అందజేశారు.

కూసుమంచిలోని గణపేశ్వరాలయాన్ని రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌ పీవీ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈసందర్భంగా మహాదేవునికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఆటో డ్రైవర్ల రక్తదాన శిబిరం

భద్రాచలం, మే 25 (ఆంధ్రజ్యోతి): తలసీమియా బాధితులకు రక్తం అందించేందుకు ఆటో జేఏసీ అధ్యక్షుడు మర్మం శంకర్‌ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ఆదివారం రక్తదానం నిర్వహించారు. పట్టణంలోని పలువురు ఆటో డ్రైవర్లు రక్తదానం చేశారు. ట్రాఫిక్‌ ఎస్‌ఐ తిరుపతిరావు మాట్లాడుతూ తలసీమియా బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్క పౌరుడు స్వచ్ఛందంగా రక్తం అందించేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్‌ నాయకులు, పోలీసులు పాల్గొన్నారు.



అన్నదాత.. జర జాగ్రత్త

“ చినుకులు రాలుతూ వాతావరణం చల్లబడటంతో త్వరలోనే వానాకాలం సాగు ప్రారంభం కానుంది. రైతులు బోర్లు, బావుల కింద పత్తి విత్తనాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు పత్తి, మిరప విత్తనాలను సైతం కొనుగోలు చేశారు. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో రైతులు జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య సూచించారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్‌ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను తమ వైపు తిప్పుకొనే ప్రయత్నాలు ప్రారంభిస్తున్నాయని, వాటిని చూసి విత్తనాలు కొనుగోలు చేయొద్దని సూచించారు. ”

» వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులు

» విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో తెలివిగా వ్యవహరించాలి

» ప్రకటనలు, ఆర్భాటాలకు మోసపోవద్దు

» ఖరీదు సమయంలో రశీదులు మరవద్దు

» శాస్త్రవేత్తలు సూచించిన ఎరువులు, పురుగుమందులనే వాడాలి

» 'కల్తీ' పరీక్షలకు వెనకాడొద్దు

ఖమ్మం వ్యవసాయం, మే 25(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్‌ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తనాల కొనుగోలు రశీదులపై నంబర్‌, విత్తన రకం, కొనుగోలు తేదీ, డీలర్‌ సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలి. గడువు దాటిన విత్తనాలు, వదులుగా, చిరిగిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి ఇచ్చిన ప్యాకెట్లు కొనుగోలు చేయవద్దు. రశీదుపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకాల పన్ను నంబర్‌, విక్రయదారుడి గ్రామం పేరు, సంతకం, తేదీలు, విత్తన రకం పేర్లు, బ్యాచ్‌ నంబర్‌, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి. కొనుగోలు చేసిన సరుకును డీలర్‌ వద్ద తూకం వేయించాలి. మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వ్యవసాయ శాఖ అధికారి, శాస్త్రవేత్తలను సంప్రదించాలి. విత్తనాలు కొనుగోలు చేసిన రశీదును పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి. విత్తనాలు తీసుకున్న వెంటనే మొలక శాతాన్ని చూసుకోవాలి. మొలక శాతం సంతృప్తికరంగా ఉన్న వాటినే విత్తనాలుగా వాడాలి.

పురుగు మందుల ఎంపిక..

పంటలో చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన పురుగుల మందులు కొనుగోలు చేయాలి. అవసరానికి మించి కొనుగోలు చేసిన, నిల్వ ఉంచిన పురుగుల మందులను వాడొద్దు. లైసెన్స్‌ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. పురుగు మందు డబ్బాలపై చక్రాకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయి. పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడకూడదు. వాడిన డబ్బాలు, సీసాలు ధ్వంసం చేసి గుంతలో పూడ్చిపెట్టాలి. ఒక పంటకు వాడిన పురుగుల మందును మరో పంటకు శాస్త్రవేత్తల సూచనల మేరకు వాడాలి.



ఎరువుల ఎంపిక..

లైసెన్స్‌ కలిగిన దుకాణాల్లోనే ఎరువులు కొనుగోలు చేయాలి. బిల్లులు, ఖాళీ సంచులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి. మిషన్‌ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులు మాత్రమే వాడాలి. ఒక వేళ చేతికుట్టుతో ఉంటే సీసం సీల్‌ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు కచ్చితంగా ఉండాలి. ఎరువులు కొనుగోలు చేసే సమయంలో డీలర్‌ రికార్డులో రైతులు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై రైతులకు ఏమైనా అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో పరీక్షలకు పంపాలి. చిల్లులు పడి, చిరిగిన ఎరువుల బస్తాలు కొనుగోలు చేయొద్దు. ఇతర పదార్థాలు కలిస్తే ఆ ఎరువును కల్తీగా గుర్తించాలి.



కల్తీలను గుర్తించండిలా..

యూరియా, కాల్షియం, అమ్మోనియం, నైట్రేట్‌ వంటి ఎరువులు గుళికల రూపంలో ఉంటాయి. ఎరువులు ఇసుక రేణువుల రూపంలో, పొటాష్‌, సూపర్‌ ఫాస్పేట్‌ పొడి రూపంలో ఉంటాయి. 5మి.లీ. నీటిలో చెంచా ఎరువును వేసి బాగా కలపాలి. ఇది స్వచ్ఛమైన ద్రావణంగా తయారైతే నాణ్యమైన ఎరువుగా గుర్తించవచ్చు. యూరియా, అమ్మోనియా క్లోరైడ్‌ ఎరువుల పరీక్షకు 10 మి.లీ. పరిశుభ్రమైన నీటిని వినియోగించాలి. యూరియా వంటి ఎరువును ఒక చెంచాను ఐదు మిల్లీలీటర్ల పరిశుభ్రమైన నీటిలో వేసి బాగా కలిపితే అడుగున మట్టి చేరితే కల్తీగా గుర్తించాలి. కొన్ని కాంప్లెక్స్‌ ఎరువులను ఇదే పద్ధతిలో పరీక్షిస్తే ఇసుక రేణువులు వచ్చే అవకాశం ఉంది. అలా వచ్చినా కల్తీ ఎరువుగా గుర్తించాలి.

అనుమతి రాక.. పునాదులు పూడ్చక..

» భీం విగ్రహ ఏర్పాటుకోసం ఆదివాసీల ఎదురు చూపులు



పునాది స్థాయిలో నిలిచిన పనులు

ఆళ్లపల్లి, మే 25(ఆంధ్రజ్యోతి): ఆళ్లపల్లి మండల కేంద్రంలో కొమరం భీం విగ్రహ నిర్మాణం ఏర్పాటుకు అనుమతులు రాక.. తీసిన పునాదులు పూడ్చక గందరగోళంలో పడింది. సుమారు నెల రోజుల క్రితం కొమరంభీం విగ్రహ ఏర్పాటు కోసం పునాధులు తీయగా, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. దాంతో పనులు నిలిచిపోయాయి. పనులు నిలిచిపోవడంతో పునాదుల పశువులు పడే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రైతువేదిక ఎదుట ఇదే కొమరంభీం విగ్రహం కోసం తీసిన పునాదుల్లో దుక్కిటెద్దు పడి మృతి చెందింది. దాంతో అప్పట్లో రైతుకు ఉన్న దుక్కిటెద్దు రైతు వేదిక ముందు గోతిలో చనిపోవడంపై తీవ్రమైన చర్చసాగింది. ప్రస్తుతం మరో ప్రమాదం జరగక ముందే ఆదివాసీ నాయకులు రెవెన్యూ అనుమతి వచ్చేలా చొరవ తీసుకోవాల్సి ఉంది.

నేటినుంచి కొర్లపాటి అంకమ్మ జాతర

సుజాతనగర్‌, మే 25 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్‌ మండలంలోని రాఘవాపురం గ్రామంలో కొర్లపాటి అంకమ్మ, మహాలక్ష్మమ్మలకు రెండేళ్లకు ఒకసారి జరిగే జాతరకు చుట్టుపక్కల గ్రామాలనుండే కాక దూర ప్రాంతాల నుంచి కూడా వేలాది మంది భక్తులు వస్తారు. ఈ జాతర సోమవారం ప్రారంభమై జూన్‌ 2న సోమవారం ముగుస్తుంది. వారం రోజులపాటు ఈ జాతర జరుగనుండటంతో వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఈ ప్రాంతం భక్తి ప్రపత్తులతో తులతూగనుంది. ఈ జాతర చివరి రోజైన సోమవారం రోజు కొర్లబండి ఊరేగింపు, ఎద్దుల బండి ఊరేగింపులు, భక్తులను మరింతగా ఆకట్టుకుంటాయి. ఈ జాతర కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు, పంచాయతీ పెద్దలు దగ్గరుండి పర్యవేక్షిస్తారు. జాతర సమయంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా వారం రోజులపాటు పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

ఉప్పొంగిన మహిళా తరంగం

» బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ

» 'ఆపరేషన్‌ సిందూర్‌' విజయాన్ని హర్షిస్తూ నగరంలో భారీ కవాతు



మాట్లాడుతున్న బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్‌, మే 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ర్యాలీని మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో భరతమాత ఆడబిడ్డల నుదుట సిందూరాన్ని తుడిచివేసిన ఉగ్రవాదులపై భారత సైన్యం 26 నిమిషాల్లో ఆపరేషన్‌ సిందూర్‌ పేరిట చేసిన యుద్ధం పాకిస్థాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టిందని అన్నారు. ఆపరేషన్‌ సిందూర్‌ ఇద్దరు మహిళా మూర్తుల ఆధ్వర్యంలో విజయవంతం కావడం హర్షణీయమన్నారు. ఆపరేషన్‌ సిందూర్‌కు సారథ్యం వహించిన సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్‌లకు ఆమె ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో అక్రమ వలసదారులను, ఇతర దేశీయులను, రోహింగ్యాలను గుర్తించి వెనక్కు పంపిస్తుంటే, మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారి ఓట్ల కోసం ఇంతవరకు ఇతర దేశీయులను గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలలో ఉన్న ఇతర దేశస్థులను ప్రభుత్వం ఎందుకు గుర్తించట్లేదని ఆమె ప్రశ్నించారు. ఖమ్మం నగరంలో ఇంతమంది జాతీయవాదులను చూసి ఆనందంగా ఉందన్నారు. అనంతరం ర్యాలీలో ఆపరేషన్‌ సిందూర్‌ ప్లకార్డులను చేతపట్టుకొని ప్రభాత్‌ టాకీస్‌ నుంచి పాత బస్టాండ్‌ వద్ద గల టీటీడీ కల్యాణ మండపం వరకు పాల్గొన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆపరేషన్‌ సిందూర్‌ విజయానికి గుర్తుగా భారత మిలటరీకి సంఘీభావంగా ర్యాలీని నిర్వహించామని అన్నారు. ఈ సందర్భంగా టీటీడీ కల్యాణ మండపంలో మహిళలు సామూహిక జాతీయ గీతం ఆలపించి ర్యాలీని ముగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దేవకి వాసుదేవరావు, సన్నె ఉదయ్‌ప్రతాప్‌, అల్లిక అంజయ్య, కార్పొరేటర్‌ దొంగల సత్యనారాయణ, గుత్తా వెంకటేశ్వర్లు, వీరవెల్లి రాజేష్‌గుప్తా, రుద్ర పతాప్‌ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సాగర్‌ కాల్వలు

» చివరి భూములకు అందని సాగునీరు

» మరమ్మతులు చేయడంలో అధికారుల అలసత్వం

» బయ్యనగూడెం వద్ద బలహీనంగా కాలువ

» ప్రమాదకరంగా తిరువూరు డిస్ట్రిబ్యూటరీ

పెనుబల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జున్‌సాగర్‌(ఎన్నెస్పీ) ప్రధాన కాల్వ, కల్లూరు, తిరువూరు మేజర్‌ డిస్ట్రిబ్యూటరీ కాల్వలు అధ్వానంగా మారడంతో నీరు చివరి భూములకు చేరటం ఇబ్బందికరంగా ఉందని రైతులు వాపోతున్నారు. పెనుబల్లి మండలంలో టేకులపల్లి, తాళ్లపెంట, గంగదేవిపాడు, వీఎంబంజర్‌, బయ్యన్నగూడెం, తుమ్మలపల్లి, కుప్పెనకుంట్ల, కారాయిగూడెం, కొండ్రుపాడు గ్రామాల రైతులకు చెందిన సుమారు 15వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. వీటితోపాటు ఈ ప్రధాన కాల్వపై తాళ్లపెంట, టేకులపల్లి, పెనుబల్లి, బయ్యన్నగూడెం, కారాయిగూడెం గ్రామాల రైతులకు చెందిన పదివేల ఎకరాలకు ఎత్తిపోతల పథకాల సాగునీరందుతుంది. మధ్యతరహా ప్రాజెక్టు అయిన లంకాసాగర్‌తోపాటు తిరువూరు మేజర్‌ ద్వారా పలు చెరువులను కూడా ఈ కాల్వ నీటి ద్వారానే నింపుతారు. ఇంతటి ప్రాధాన్య ఉన్న ఎన్నెస్పీ ప్రధాన కాల్వకు మరమ్మతులు చేపట్టడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

ప్రధాన కాల్వకు మరమ్మతులు చేపట్టాలి

వంశీకృష్ణ, కౌలు రైతు, కారాయిగూడెం



నేను ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాను. సాగర్‌ ప్రధాన కాల్వలో తూటికాడతో నిండిపోయి అధ్వానంగా తయారైంది. చెరువులు, ఎత్తిపోతల పథకాలు ఈ కాల్వ నీటిపై ఆధారపడి ఉన్నాయి. తిరువూరు మేజర్‌ వద్ద ప్రధాన కాల్వ కట్ట బలహీనంగా ఉంది. ఏసమయంలోనైనా తెగిపోయే ప్రమాదముంది. కాల్వలో కూడా తూటికాడ, పిచ్చిమొక్కలు పెరిగి నీరు పారడానికి అనుకూలంగా లేదు.

కాల్వ తెగడంతో ఇబ్బందులు పడ్డాం

దొడ్డా వెంకటేశ్వర్లు, రైతు, కుప్పెనకుంట్ల



తిరువూరు మేజర్‌ నుంచి అనేక గ్రామాలకు చెందిన రైతులు వేలాది ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. ప్రధాన కాల్వ వద్ద కట్ట బలహీనంగా ఉంది. రెండేళ్ల క్రితం ప్రధాన కాల్వ తెగిపోవడం వలన 15నుంచి 20రోజులపాటు నీళ్ల రాక అనేక ఇబ్బందులు పడ్డాం. అధికారులు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలి. కాల్వలో కూడా పూడిక తీయించాలి.

రెండేళ్ల క్రితం ప్రధాన కాల్వకు మరమ్మతులు చేపట్టకపోవడంతో బయ్యన్నగూడెం వద్ద ప్రధాన కాల్వకు రాత్రి సమయంలో గండి పడి వరదనీరు గ్రామంలోకి చేరడంతో రైతులు, గ్రామస్థులు ఆందోళన చెందారు. అప్పటి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కాల్వ గండిని పూడ్చారు. కానీ మళ్లీ అదే ప్రాంతంలో ప్రధాన కాల్వకు గండి పడే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు తుమ్మలపల్లి సమీపంలో తిరువూరు డిస్ట్రిబ్యూటరీ కాల్వ వద్ద ప్రధాన కాల్వకు ప్రమాదకరంగా మారింది. డిస్ట్రిబ్యూటరీ తూముకు రెండువైపులా మట్టి లేకపోవడంతో బలహీనంగా ఉంది. డిస్ట్రిబ్యూటరీ కాల్వ ఏసమయంలోనైనా కట్ట తెగిపోతుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిరువూరు మేజర్‌ కాల్వ సైతం లైనింగ్‌ పగిలిపోయి తుంగతో నిండి చివరి భూములకు నీరు చేరడం లేదని రైతులు వాపోతున్నారు. సాగర్‌ ప్రధాన కాల్వతోపాటు డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



తిరువూరు మేజర్‌ కాల్వలో ధ్వంసమైన లైనింగ్‌వాల్‌



కాల్వలో పేరుకుపోయిన తూటికాడ



బలహీనంగా ఉన్న తిరువూరు డిస్ట్రిబ్యూటరీ కాల్వ

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో జాప్యం

(5వ పేజీ తరువాయి)

రైతులు ఇంకా జీలుగులు అందకపోవడంతో ఆందోళనలో పడ్డారు. కల్లూరు మండలానికి గాను రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు జీలుగులు పోచారం, చెన్నూరు, కొర్లగూడెం, కల్లూరు ప్రాథమిక సహకార సంఘాల గోదాములకు చేరి వారం రోజులు కావస్తోంది. కానీ ఇంత వరకు వ్యవసాయశాఖ తరుపున పంపిణీకి ఏర్పాట్లు చేయలేదు. మండలానికి గాను 829 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు మాత్రమే వచ్చాయి. ఇక అదను దాటితే ఈ ప్రాంత భూములకు ఏమాత్రం ఉపయోగకరంగా ఉండదు. ఈ విషయమై వ్యవసాయశాఖ వారిని సంప్రదించగా పచ్చిరొట్ట సాగుకు వచ్చిన జీలుగు విత్తనాలను మొలక శాతం నిర్ధారణకు ఖమ్మం పరీక్ష కేంద్రానికి పంపినట్లు తెలిసింది. ఈ విషయంలో జాప్యం జరగకుండా రైతులకు ఉపయోగపడేలా ఈ విత్తనాలను సత్వరమే పంపిణీ చేయాలని పలు గ్రామాల రైతులు అధికారులను కోరుతున్నారు.

తాటి ముంజలు కొంటుండగా కబళించిన మృత్యువు

» కారు ఢీకొని తల్లీ కొడుకు మృతి

» బూడిదంపాడు వద్ద ఘటన

» మృతులు జాస్తిపల్లి వాసులు

రఘునాథపాలెం, మే 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన తాటి ముంజలు కొంటున్న తల్లి, కొడుకును రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. కామేపల్లి మండలం జాస్తీపల్లికి చెందిన బత్తుల వెంకటస్వామి, శారద(32) దంపతులు. వీరు కుమారుడు కార్తిక్‌(12)తో కలిసి ఆదివారం ఖమ్మంలో ఓశుభ కార్యక్రమానికి వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తున్నారు. రఘునాథపాలెం మండలం బూడిదంపాడు వద్ద గీతకార్మికులు రోడ్డు పక్కన తాటి ముంజలు అమ్ముతుండటంతో కార్తిక్‌ తనకు తాటి ముంజలు కావాలని కోరాడు. దీంతో బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి వారు ముంజలు కొనుగోలు చేస్తున్నారు. ఇదే సమయంలో ఖమ్మం నుంచి ఇల్లెందు వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వెంకటస్వామి, కార్తిక్‌లను ఢీకొంది. దీంతో శారద(32), కార్తిక్‌ (12)కు తీవ్రగాయాలైనాయి. క్షతగాత్రులను ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా కన్నుమూశారు. వెంకటస్వామికి గాయాలైనాయి.





కార్తిక్‌, శారద మృతదేహాలు

ప్రశాంతంగా 'గ్రామపాలన అధికారి' పరీక్ష

» పరిశీలించిన నోడల్‌ అధికారి పద్మశ్రీ

ఖమ్మం కలెక్టరేట్‌, మే 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రామపాలన అధికారి పరీక్షను పకడ్బందీగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలకు ఖమ్మం జిల్లా నోడల్‌ అధికారిగా డీఆర్వో పద్మశ్రీ వ్యవహరించారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.00 గంటల వరకు జవాబు పత్రాలను తరలించారు. మొత్తం 255 మంది అభ్యర్థులకుగాను 225మంది పరీక్షలను రాశారు. మిగిలిన 30మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రమైన ఖమ్మంలో ఎస్‌బీఐటీ కాలేజీలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షను డీఆర్వో పద్మశ్రీ పర్యవేక్షించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఎలక్ట్రానిక్‌ పరికరాలు, వాచీలు తీసుకు రాకుండా తనిఖీ చేశారు. కాపీయింగ్‌ షాపులు మూసివేశారు. జిల్లాలో ఈ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు తెలిపారు.

రైతులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

» మాస్‌లైన్ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న చంద్ర అరుణ

దమ్మపేట, మే 25(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాస్‌లైన్ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ విమర్శించారు. దమ్మపేటలోని వినాయక ఫంక్షన్ హాల్, ఏనుగు అయ్యప్పనగర్‌లో ఆదివారం జిల్లా అఖిల భారత ఐక్యరైతు సంఘం మహాసభలు జరిగాయి. జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న అధ్యక్షతన జరిగిన మహాసభలో ఆమె మాట్లాడుతూ రైతుల ప్రస్తుత కష్టాలకు, ఆత్మహత్యలకు మూలకారణం బహుళజాతి కంపెనీలేనని ధ్వజమెత్తారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్ కంపెనీల కోసమే పనిచేస్తుందన్నారు. దేశంలో నేడు వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు వీటిని పట్టించుకోకుండా నూతన వ్యవసాయ మార్కెట్ బిల్లును, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను మరిచి రైతుకు వెన్నుపోటుపొడిచిందన్నారు. రాష్ట్రంలో కల్తీ విత్తనాలు, ఎరువులతో రైతులు నష్టపోతున్నా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వమే రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, కార్యదర్శివర్గ సభ్యులు అమర్లపుడి రాము, గోవిందపల్లి ప్రభాకర్, నూపా భాస్కర్, రైతు సంఘం నాయకులు ధర్మ, కంగాల కన్నయ్య, ఈసం శంకర్, బానోత్ పంతులు, డివిజన్ కార్యదర్శులు వీరబాబు, నాగేశ్వరరావు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కెచ్చెల కల్పన, తోడెం దుర్గయ్య, అమర్లపుడి శరత్, సావిత్రి పాల్గొన్నారు.

మూగజీవాల రోదన

» జోరుగా వన్య ప్రాణుల వేట » నానాటికీ అంతరిస్తున్న అడవి జంతువులు


వేటగాళ్లు అమర్చిన ఉచ్చు వైర్లను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్వో

జూలూరుపాడు, మే 25(ఆంధ్రజ్యోతి): వన్య ప్రాణుల సంరక్షణ చట్టం చట్టుబండగా మారింది. అడవి జంతువులను కాపాడాల్సిన అటవీ శాఖ నిర్లక్ష్యం కారణంగా జంతువులు వేటగాళ్ల ఉచ్చులకు బలైపోయి, రోజురోజుకి వాటి సంతతి అంతరించిపోతుంది. వన్యప్రాణులను ఆదాయ వనరులుగా మార్చుకున్న వేటగాళ్లు పన్నే పన్నాగంలో అడవి జంతువులు విలవిలలాడిపోతున్నాయి. అడవి జంతువులను వేటాడకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నా సంబంధిత శాఖాధికారుల ప్రకటనలు కార్యరూపం దాల్చడంలేదు. వేటగాళ్లు తమ ఇష్టారీతిన జంతువులను వేటాడుతున్నారు. జూలూరుపాడుఅటవీ రేంజ్ ప్రాంతంలో గుండెపుడి, రాజులపాలెం, నల్లబండబోడు, వినోభానగర్, రాజారావుపేట, పాపకొల్లు, జూలూరుపాడు తదితర బీట్లు ఉండగా, సుమారు 10వేల ఎకరాల అటవీ భూమి ఉంది. ఈ ప్రాంతాలలో అడవి పందులు, కొండ గొర్రెలు, దుప్పులు, కుందేళ్లు, కనుజులు వంటి జంతువుల సంచరిస్తున్నాయి.

యథేచ్ఛగా మాంసం అమ్మకాలు ..

మండలంలోని పాపకొల్లు, బోజ్యాతండా, గుండ్లరేవు, జూలూరుపాడు, రామచంద్రాపురం, నల్లబండబోడు, సూరారం గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు తాము వేటాడిన అడవి జంతువుల మాంసాన్ని వివిధ ప్రాంతాలలో విక్రయిస్తున్నారు. అదే విధంగా ఇతర ప్రాంతాలకు కూడా మాంసాన్ని ఎగుమతి చేస్తున్నారు. కేజీ మాంసం రూ. 500ల నుంచి రూ. 800ల వరకు అమ్ముతున్నారు. ఇది ఇలా ఉండగా ఏన్కూర్, కొణిజర్ల, చంద్రుగొండ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు సైతం అడవి మాంసాన్ని నిత్యం మండలానికి తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తుండటం గమనార్హం.

అటవీ రేంజ్ పరిధి లోని పాపకొల్లు, సూరారం, నల్లబండబోడు, బేతాళపాడు తదితర అటవీ ప్రాంతాలలో గత కొన్ని నెలలుగా జంతువుల వేట జోరుగా సాగుతుంది. కొందరు వ్యక్తులు వేటాడటమే వృత్తిగా పెట్టుకొని అటవీ ప్రాంతాలలో, పంట పొలాల్లో ఉచ్చులు ఏర్పాటు చేస్తున్నారు. ఇంకొందరు నాటు తుపాకులతో వన్యప్రాణులను వెంటాడి వేటాడుతున్నారు. జంతువుల వేట ఆర్థిక వనరులుగా మార్చుకుని అదే పనిగా కొందరు వేటగాళ్లు సొమ్ముచేసుకుంటున్నారు. వేసవి కాలం కావడంతో నీటి కోసం గ్రామ సమీపాలలోని పొలాల్లోకి వచ్చే జంతువులను సైతం వేటగాళ్లు వదిలిపెట్టడం లేదు.

జంతువులను వేటాడితే చర్యలు

● ప్రసాదరావు ఎఫ్ఆర్వో, జూలూరుపాడు



అడవి జంతువులను వేటాడకుండా తమ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. రేంజ్ పరిధిలోని పాపకొల్లు, సూరారం అటవీ ప్రాంతాలలో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశాం. నిత్యం అటవీ ప్రాంతాలలో తమ సిబ్బంది ముమ్మరంగా గస్తీ నిర్వహిస్తున్నారని, ఈ ఏడాది జంతువులను వేటాడినట్లు తమకు ఆనవాళ్లు కూడా కనిపించలేదన్నారు. గ్రామాలలో ఎవరైనా వ్యక్తులు అడవి జంతువు మాంసాన్ని విక్రయించిన, వేటాడినా అటవీ సిబ్బందికి సమాచారాన్ని అందించాలని కోరారు.

చోద్యం చూస్తున్న అటవీ శాఖ అధికారులు

కొంతకాలంగా అడవి జంతువుల వేట యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ దానిని నిరోధించడకుండా అటవీ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు మిన్నకుండిపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వేటగాళ్ల ఉచ్చులకు బలై వన్యప్రాణుల సంఖ్య రోజురోజుకి తగ్గిపోతుందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా అటవీ అధికారులు ముమ్మరంగా సాగుతున్న వేటను అరికట్టి వన్యప్రాణులను కాపాడి అంతరించి పోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విష ఆహారం తిని
మూగజీవాల మృత్యువాత

» సుమారు 30కిపైగా మేకలు, గొర్రెల మృతి » మరో 40 మేకలకు అస్వస్థత

కూసుమంచి, మే 25(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు కొట్టిన మేత తిని సుమారు 30కిపైగా జీవాలు మృత్యువాత పడగా, మరో 40 జీవాలు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. ఈ సంఘటన ఖమ్మంరూరల్ మండలం ఆరెకోడులో విషాదం చోటుచేసుకుంది. తండాకు చెందిన పలువురు రైతులకు చెందిన ఆదివా రం ఉదయం మేతకు బయలుదేరాయి. అనంతరం కొద్దిసేపటికే 12జీవాలు అక్కడికక్కడే మృతిచెందాయి. వాటిని ఖమ్మం ప్రభుత్వ పశువైద్యశాలకు తరలించిన అనంతరం, మరో 20 మృతి చెందగా మరికొన్ని అస్వస్థతకు గురైనట్లు రైతులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పశువైద్యాధికారి డాక్టర్ హరీష్ సంఘటనా స్థలానికి చేరుకుని జీవాలకు వైద్యం అందించారు. ఒక్కరోజే 30జీవాలకు పైగా మృత్యువాత పడడంతో పాటు, మరికొన్ని అస్వస్థతకు గురవడంతో పెంపకందారులు ఆందోళనకు గురయ్యారు. ఓ బెండతోటలో మందు పిచుకారీ చేసిన అనంతరం దానిని తినడంతోనే జీవాలు మృతి చెందినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


మృతిచెందిన జీవాలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఒకేనెలలో రెండు సంఘటనలు

ఆరకోడుతండా సమీపంలో చింతపల్లి గ్రామంలో సైతం ఇదేతీరుగా పశువులు మృతి చెందిన సంఘటన తెలిసిందే. అప్పట్లో వేటగాళ్లు విష ఆహారం పెట్టిన మేతను పశువులు మేయడం ద్వారా మృతి చెందినట్లు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఇదేరీతిలో ఇప్పుడు ఆరెకోడులో జీవాలు ఒక్కసారే ఎక్కువసంఖ్యలో మృతి చెందడంతో ఆందోళనకు గురిచేస్తుంది. పోస్టు మార్టం నిమిత్తం ఎందుకు జీవాలు మృతిచెందాయో పూర్తిస్థాయిలో తెలిసే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు

బాధితులకు సీపీఐ నాయకుల పరామర్శ

ఆరెకోడులో మేకల, పెంపకందారులను సీపీఐ జిల్లా నాయకులు పరామర్శించారు. సీపీఐ జాతీయసమితీ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఘటనాస్థలాన్ని సందర్శించి, రైతు కుటుంబాలను ఓదార్చారు. పదుల సంఖ్యలో జీవాలు మృతిచెంది, తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బాగం హేమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

» ఇల్లెందు ఏరియా జీఎం కృష్ణయ్య

ఇల్లెందు టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని ఇల్లెందు ఏరియా జీఎం వి.కృష్ణయ్య అన్నారు. ఆదివారం ఏరియాలోని కోయగూడెం ఓసీలో ఉదయం 6గంటలకే సామాన్యుడిలా కార్మికులతో కలిసి అల్పాహారం చేస్తూ ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు పలు విషయాలపై కార్మికులకు సూచనలు చేశారు. సింగరేణి ఉన్నతాధికారి అయినప్పటికీ సాధారణ కార్మికుడిలా మారి కార్మికులతోనే కలిసి క్యాంటీన్‌లో టిఫిన్ చేసి వారి బాగోగులను తెలుసుకున్నారు. ఏరియాను బొగ్గు ఉత్పత్తిలో నెంబర్ వన్ స్థానంలో ఉండేలా కార్మికులు కృషి చేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏరియా జీఎం తమతో కలిసి అల్పాహారం తీసుకోవడంతో కార్మికులు ఉబ్బితబ్బిపోయారు. జీఎంతో తాము కలిసిపోయామని కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.


కార్మికులతో కలిసి టిఫిన్ చేస్తున్న జీఎం కృష్ణయ్య

టేకు చెట్లు నరికారని ఫిర్యాదు

దుమ్ముగూడెం మే 25 (ఆంధ్రజ్యోతి): అడవిలో విలువైన టేకు చెట్లను ఇద్దరు ఫారెస్ట్ ప్రొటెక్షన్ వాచర్లు ఆదివారం అక్రమంగా నరికి తమకు వ్యతిరేకంగా సాక్ష్యాలను సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని గడ్డోరుగట్ట పోడుసాగుదారులు ఆదివారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పర్ణశాల దక్షిణ విభాగం గడ్డోరుగట్ట రిజర్వ్‌ఫారెస్ట్‌లో ఫారెస్ట్ ప్రొటెక్షన్ వాచర్లు సోడి వసంతరావు, అపక బాబులు తాము చేస్తున్న పోడు భూమి సమీపంలో టేకు చెట్లను నరుకుతున్న క్రమంలో తాము పట్టుకునేందుకు ప్రయత్నించగా దొరక్కుండా పారిపోయారని పోడుసాగుదారులు తెలిపారు. తమను దోషులుగా చిత్రీకరించేందుకు జరిగిన ప్రయత్నమని అన్నారు. ఈ విషయం ఎఫ్‌డీఓ సుజాత, ఎఫ్ఆర్ఓ కమల, సెక్షన్ అధికారి నందాలకు తెలిపినప్పటికీ వారు పట్టించుకోలేదని తెలిపారు. అటవీశాఖ అధికారులు కావాలని తమపై నేరం మోపేందుకు టేకు చెట్లను నరికారన్నారు. ఈ విషయమై రేంజి అధికారి కమలను వివరణ కోరగా, పోడుసాగుదారులే చెట్లు కొట్టి ప్లాంటేషన్ వాచర్ల మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. దీనిపై సోమవారం విచారణ జరుపుతామన్నారు.

బూర్గంపాడు ఐకేపీలో నిధుల గోల్‌మాల్

» అవకతవకలకు పాల్పడిన సీసీ

» షోకాజ్ నోటీసులు జారీ చేసిన అధికారులు


ఐకేపీ ఎదుట ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలు(ఫైల్)

బూర్గంపాడు, మే 25(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు ఐకేపీలో నిధుల గోల్‌మాల్ అంశం స్థానికంగా చర్చ నీయంశంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపం ఓ సీసీకి వరంగా మారింది. డ్వాక్రా మహిళల నుంచి వసూలు చేసిన స్త్రీనిధి రుణాలు వారి ఖాతాల్లో జమ చేయకుండా తన సొంత అవసరాలకు వినియోగించుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బూర్గంపాడు మండల పరిధిలో రాంబాబు అనే వ్యక్తి సీసీగా పని చేస్తున్న క్లస్టర్ నందు శబరి వీఓ నందు రూ.1,92,000లు స్త్రీ నిధి దుర్వినియోగం జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. అదే విధంగా వెన్నెలజ్యోతి, జీవన్‌జ్యోతి, నకిరిపేట, టేకులచెరువు, ఉడ్‌యార్డు, శ్రీరామ, శబరి, చైతన్య, కృష్ణసాగర్ వీఓల నందు స్త్రీ నిధి నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. సుమారు రూ.30లక్షల మేర నిధులు గోల్‌మాల్ అయినట్లుగా తెలుస్తోంది. విషయం ఆ శాఖ ఉన్నాతాధికారులకు చేరడంతో సీసీ వినియోగించుకున్న నగదు తిరిగి చెల్లించడానికి కొంత సమయం ఇచ్చారు. ఇచ్చిన సమయంలోపు సరైన స్పందన లేకపోవడంతో అధికారులు అతడికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీనిపై డీఆర్‌డీఏ ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. దీనిపై ఏపీఎం నాగార్జున ను వివరణ కోరగా రుణాలు గోల్‌మాల్ అయిన వి షయం తన దృష్టికి వచ్చిందని అన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఆందోళనలో డ్వాక్రా మహిళలు

సీసీ డ్వాక్రా నిధులను సొంతానికి వినియోగిం చుకున్న ఘటన వెలుగులోకి రావడంతో సంబంధిత డ్వాక్రా మహిళలు ఆందోళన చెందుతున్నారు. కూలీ, నాలీ చేసి సంపాదించిన సోమ్మును డ్వాక్రాలు కడితే వాటిని తమ ఖాతాలో జమ చేయకుండా అవసరాలకు వాడుకోవడం ఎంటని ప్రశ్నిస్తున్నారు. తమ కుటుంబ అవసరాల నిమిత్తం కూడబెట్టుకున్న సో మ్మును తమ ఖాతాలో జమ చేయకుండా గోల్‌మాల్ చేయడం పట్ల సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని పలు డ్వాక్రా మహిళలు సైతం ఆందోళన వ్య క్తం చేస్తున్నారు. ఉన్నాతాధికారులు విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

అశ్వారావుపేట రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఆదివారం వినాయకపురం గ్రామంలో జరిగింది. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన కమ్మచిచ్చు సుమంత్(22) కొంతకాలంగా ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లిలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. వేతనం సరిపోక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఇదే తరుణంలో ఈనెల 22న ఇంటికి వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులు వేధిస్తుండటంతో అదే రోజు రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అడ్మిషన్లు పెరిగేనా..?

» గత ఏడాది 46 ప్రభుత్వ పాఠశాలల్లో జీరో అడ్మిషన్లు

» నామమాత్రంగానే బడిబాట కార్యక్రమాల నిర్వహణ

ఖమ్మం ఖానాపురం హవేలీ, మే 25(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఐనా ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెరిగేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేస్తారా అన్నది తెలియాల్సి ఉంది. 2024-25 విద్యాసంవత్సరంలో జిల్లాలో 46 ప్రభుత్వ పాఠశాలల్లో జీరో అడ్మిషన్లు నమోదైన విషయం తెలిసిందే.. గత ఏడాది మొత్తం 54 ప్రభుత్వ పాఠశాలల్లో జీరో అడ్మిషన్లు ఉండగా, 8 పాఠశాలల్లో కొన్ని అడ్మిషన్లు రాగా మిగిలిన 46 పాఠశాలల్లో ఒక్క అడ్మిషన్ కూడా రాలేదంటే జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రతి ఏటా నిర్వహించే బడిబాట కార్యాక్రమాల నిర్వహణ ఎలా ఉందో చెప్పవచ్చు. 2025-26 విద్యా సంవత్సరంలో బడిబాట నిర్వహణకు ముందస్తు ప్రణాళికలు లేకపోవడం, నామమాత్రంగానే బడిబాట నిర్వహిస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు జిల్లాలో బడిబాట అంటూ విద్యాశాఖ అధికారులు హడావుడి చేస్తున్నా క్షేత్రస్థాయిలో దానికి స్పందన నామమాత్రంగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థలతో పోలిస్తే ప్రభుత్వ బడుల పరిస్థితి అడ్మిషన్ల విషయంలో చాలా వెనుకబడి ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కేవలం ప్రచార ఆర్భాటం తప్ప పిల్లలను బడులకు తీసుకెళ్లాలనే తపన చాలామంది ఉపాధ్యాయుల్లో కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఒకరిద్దరు టీచర్లు, నలుగురైదుగురు విద్యార్థులను వెంటబెట్టుకొని నామమాత్రంగా ఫొటోలకు ఫోజులిచ్చి బడిబాట కార్యక్రమం చేపట్టామంటూ నివేదికలు పంపుతున్నారనే విమర్శలున్నాయి. మూతపడుతున్న ప్రభుత్వ పాఠశాలల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు ఈ సంవత్సరం బడిబాట విషయంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జీరో అడ్మిషన్ల పాఠశాలల వివరాలు

ఖమ్మం జిల్లాలో 1 నుంచి 10 మంది విద్యార్థులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలు 134, 11 నుంచి 40 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు 544, 41 నుంచి 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు 168 ఉండగా, జిల్లాలో జీరో అడ్మిషన్లు ఉన్న పాఠశాలలు 46 ఉన్నాయి. జిల్లాలోని వివిధ మండలాల్లోని పాఠశాలల్లో జీరో అడ్మిషన్లు గల పాఠశాలలు.. ఏన్కూర్‌లో-ఒకటి, కల్లూరులో-7, కామేపల్లిలో-5, ఖమ్మం రూరల్‌లో-ఒకటి, మధిరలో-4, ముదిగొండలో-2, నేలకొండపల్లిలో-2, పెనుబల్లిలో-6, రఘునాధపాలెంలో ఒకటి, సత్తుపల్లి-2, సింగరేణిలో-2, తల్లాడలో-6, తిరుమలాయపాలెంలో-3, వేంసూర్‌లో-ఒకటి, వైరాలో -ఒకటి, ఎర్రుపాలెంలో-2 ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడనున్నాయి.

1,280 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1,280 ఉండగా ప్రైవేటు పాఠశాలలు 250పైగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 1నుంచి 10వతరగతి చదివే విద్యార్థులు 1,30,000 మంది ఉండగా, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు 2లక్షలకు పైగానే ఉన్నారు. ప్రభుత్వ స్కూళ్లు అధికంగా ఉన్నా విద్యార్థుల సంఖ్యమాత్రం ప్రైవేటుసగానికి తక్కువగానే హాజరుశాతం ఉండడం, విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉంది. ప్రతిఏటా నిర్వహించే బడిబాటలో విద్యార్థులను గుర్తించడం తప్ప వారిని బడుల్లో చేర్పేలా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తెలుగు మీడియంతోపాటు ఇంగ్లిషమీడియం అందుబాటులో తెచ్చినా విద్యార్థుల హాజరుశాతం మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలాల్లో చదివితే వచ్చే ప్రయోజనాలు గురించి వివరించలేకపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేదుకు అధికారులు కృషిచేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. గత ఏడాది జూన్ నెలంతా బడి బయటి పిల్లలను బడిలో చేర్చుకునేందుకు, చదువులో వెనుకబడిన విద్యార్థులకు సంసిద్ధతా కార్యక్రమాలు నిర్వహించిన ఉపాధ్యాయులు జులై నుంచి బోధన మొదలు పెట్టాల్సి ఉంది, కానీ గత విద్యా సంవత్సరం ఆదిలోనే హంసపాదు ఎదురైనట్లు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పేందుకు తీరికదొరకడంలేదనే వాదనలు వినబడుతున్నాయి.



అంతంత మాత్రంగానే బడిబాట...

2025-26 విద్యా సంవత్సరంలో బడిబాట కార్యక్రమాలను వేసవి సెలవులలో నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. గత ఏడాదిపదోన్నతులు, బదిలీలు నిర్వహించిన విద్యాశాఖ అధికారులు ఈ ఏడాది ఉపాధ్యాయులకు శిక్షణ పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇలా పాఠశాలలు ప్రారంభించే నాటి వరకు ఏదో ఒక కార్యక్రమంతో ఉపాధ్యాయులను ఉంచి ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు పూర్తైన తరువాత ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమం నిర్వహిస్తారనే విమర్శలు వినబడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల చదివే కొంత మంది విద్యార్థులు సమీపంలోని ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారే తప్ప, ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులు లేరంటే ప్రభుత్వ పాఠశాలల తీరు ఎలా ఉందో చెప్పవచ్చు. ఖమ్మం నగరంలోని కొన్ని పాఠశాలల్లో మాత్రము అడ్మిషన్లు వస్తున్నాయి తప్ప, మిగిలిన పాఠశాలల్లో అడ్మిషన్లు రాకపోవటానికి కారణం ఏమిటో ఆ శాఖ అధికారులకు, ఉపాధ్యాయులకే తెలియాలి. పదోన్నతులు, బకాయిల కోసం అధికారులను కలిసే ఉపాధ్యాయులు అడ్మిషన్లు విషయంలో మాత్రం మాకెందుకులే అన్నట్లు వ్యవహరించడం వెనుక మతలబు ఏమిటో తెలియని పరిస్థితి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కొణిజర్ల, మే25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కొణిజర్లలో జరిగింది. ఎస్ఐ సూరజ్ తెలిపినవ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దరాంపురం గ్రామానికి చెందిన ఇనపనూరి నాగేశ్వరరావు(35) పెద్ద కుమార్తె లక్ష్మీప్రియ అనారోగ్యానికి గురికావడంతో ద్విచక్రవాహనంపై ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆమెను పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేరమని చెప్పడంతో కుమార్తెను ఆస్పత్రిలో చేర్పించి డబ్బులు కోసమని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో కొణిజర్ల వద్ద మధిర నుంచి ఖమ్మం వస్తున్న ఆర్టీసీ బస్సు అతడిని ఢీకొట్టింది. దీంతో నాగేశ్వరరావు రోడ్డుపై పడగా బస్సుపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని ఖమ్మం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చింతకాని, మే 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వందనం గ్రామానికి చెందిన రైతు మిట్టపల్లి వెంటేశ్వర్లుకు చెందిన గేదె విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందింది. గ్రామ శివారులో మేత మేస్తుండగా కరెంటు స్తంభానికి తెగిపడిన తీగ ప్రమాదవశాత్తు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

కేఎంసీ రెవెన్యూ అవకతవకలపై విచారణ

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 25(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలోని రెవెన్యూ, ఇతర విభాగాల అధికారులు సోమవారం వరంగల్‌లోని విజిలెన్స్ అధికారుల ఎదుట హాజరుకానున్నారు. ఈ మేరకు విజిలెన్స్ అధికారులు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి నోటీసులు పంపారు. 2021 నుంచి ఖమ్మం నగరంలో ఇంటి నెంబర్లు కేటాయింపులో అవకతవకలు, నిబంధనలు పాటించకుండా రెవెన్యూ అనుమతులు జారీపై గతంలో అనేక విచారణలు జరిగాయి.

విచారణకు కేఎంసీలో పనిచేసి ఇటీవల కాలంలో డోర్నకల్, మహబూబాబాద్‌కు ఇటీవల బదిలీపై వెళ్లిన రెవెన్యూ అధికారులుతో పాటుగా ఖమ్మంలోని కొంతమంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు హాజరుకానున్నారు.



నేడు విద్యుత్ ప్రజావాణి

ఖమ్మంసంక్షేమవిభాగం, మే25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారానికి ప్రతీ సోమవారం ఖమ్మం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ సమస్యలపై టోల్ ఫ్రీనెంబర్ 1912కు ఉచితంగా ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు. విద్యుత్ హైటెన్షన్ (హెచ్‌టీ) 11కేవీ,33కేవీ ఆపై వోల్టేజీ సర్వీసులు సత్వర మంజూరు కోసం సింగిల్ విండో వ్యవస్థను సరళీకృతం చేశామన్నారు. ఏడీఈ స్థాయిలోనే మానటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు.



గడ్డిని పంపుతున్న నేలకొండపల్లికి చెందిన సుబ్రమణ్యం

గోశాలకు గ్రాసం వితరణ

నేలకొండపల్లి, మే25(ఆంధ్రజ్యోతి):నేలకొండపల్లికి చెందిన ఉదయసాయి ఏజెన్సీస్, సుగుణ బేకరీకి చెందిన మాటూరి సుబ్రమణ్యం ఖమ్మంలోని శ్రీవెంకటేశ్వర గోశాలకు ట్రాక్టర్ గడ్డిని వితరణ చేశారు. గోశాలలో ఉన్న ఆవులు గ్రాసానికి ఇబ్బంది పడకుండా తన వంతుగా ట్రాక్టరు వరిగడ్డిని పంపుతున్నట్లు సుబ్రమణ్యంశ్రీదేవి చెప్పారు. దాతలు సహకరించాలని వారు విన్నవించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, రేగూరి హనుమంతరావు, మాటూరి శేషగిరిరావు, యెండూరి బ్రహ్మం, యర్రా నాగేశ్వరరావు, దోసపాటి చంద్రశేఖర్, బోనగిరి రామశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

'పీఎం విశ్వకర్మ' సద్వినియోగం చేసుకోండి

బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి

నేలకొండపల్లి, మే25 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం ద్వారా లబ్ధిదారులకు కేంద్రం అందిస్తున్న కిట్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ కోరారు. బీజేపీ ప్రభుత్వం చేతివృత్తిదారుల కోసం పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. చేతి వృత్తిదారులు స్వయం సమృద్ధి సాధించేలా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని, అందులో భాగంగా చేతి వృత్తుల వారికి పరికరాలను అందచేస్తున్నదన్నారు.రాయగూడెంలో 14మందికి సుధాకర్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొండా హర్షవర్ధన్, కాళంగి వెంకటేశ్వర్లు, పోతనబోయిన శేషు, సూరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న సుధాకర్

గతానికి భిన్నంగా ఉపాధ్యాయ శిక్షణ

- 21 కేంద్రాల్లో మండల స్థాయిలో కార్యక్రమం
- సమగ్ర ప్రణాళికతో విద్యాసంవత్సరం ప్రారంభం
- జిల్లా ప్రత్యేక అధికారిగా ఎస్ఐఈటీ డైరెక్టర్ విజలక్ష్మిబాయి
- 5,276 మంది ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న విజయలక్ష్మీబాయి(ఫైల్)

ఖమ్మంఖానాపురంహవేలి, 25మే(ఆంధ్రజ్యోతి): జూన్ 12నుంచి నూతన విద్యా సంవత్సరంప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వ విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. ఈకార్యక్రమం అమలులో భాగంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈనెల13 నుంచి30 వరకు ఈ శిక్షణ కార్యక్రమాలు జిల్లా స్థాయిలో కొనసాగుతుండగా మండల స్థాయి శిక్షణా శిబిరాలు ఈనెల 19నుంచి 24వరకు నిర్వహించారు. ఈ శిక్షణలో మొత్తం 5,276 మంది ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు పాల్గొంటున్నారు.

శిక్షణకు పకడ్బందీ ఏర్పాట్లు

ఉపాధ్యాయ శిక్షణ కళాశాలకు సుదీర్ఘకాలంగా ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ డీఈవోగా రావడంతో ఉపాధ్యాయుల శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఉపాధ్యాయ శిక్షణలో ఉన్న అనుభవాన్ని జోడించి జిల్లా సమగ్ర శిక్ష సమన్వయ కర్తలు, ఎంఈఓలతో ప్రత్యేకంగా చర్చించి సమగ్రమైన శిక్షణ ప్రణాళికను రూపొందించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బందితో పాటు డైట్ కళాశాల, ఎమ్మార్సీల సిబ్బందితో సహా పూర్తిస్థాయిలో జిల్లా విద్యాశాఖ యంత్రాంగం మొత్తం ఈ శిక్షణా శిబిరాలను విజయవంతం చేయడానికి పూర్తిస్థాయిలో నిమగ్నమై పనిచేస్తోంది. శిక్షణ శిబిరాల నిర్వహణకు గాను ఎస్ఐఈటీ డైరెక్టర్ విజలక్ష్మీబాయిని జిల్లాప్రత్యేక అధికారిగా నియమించారు.

ప్రత్యేక అంశాలపై దృష్టి

శిక్షణ,బడిబాట, యూనిఫారం, పాఠ్య పుస్తకాల సరఫరా, పాఠశాల అనుబంధ అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలలో మౌలిక వసతులు, ఉపాధ్యాయ సిబ్బంది వివరాలు వంటి అంశాలపై దృష్టి సారించారు.ఉపాధ్యాయులు సైతం శిక్షణ ఆవశ్యకత ను గుర్తించి పూర్తిస్థాయిలో కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఫలితంగా జిల్లాలో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమం రాష్ట్ర అధికారులు, పరిశీలకుల ప్రశంసలు పొందింది. వేసవి దృష్ట్యా ఉపాధ్యాయులకు శిక్షణలో అసౌకర్యం కలుగకుండా వీలైనంతవరకు ఏసీ రూమ్స్ ఉండే విధంగా ఏర్పాటు చేశారు.

ప్రత్యేక శిక్షణ

గతఆనవాయితీకి భిన్నంగా ఈసారి శిక్షణలో ఉపాధ్యాయులకు ఏయే అంశాలలో ప్రత్యేక శిక్షణ అవసరమో భావించి అటువంటి నిపుణులను గుర్తించి వారితో శిక్షణ ఇప్పిస్తున్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్న దృష్ట్యా సైబర్ క్రైమ్ ఏసీపీ వంశి కళాధర్ ఇతర అధికారులు సైబర్ నేరాలు, మహిళల అక్రమ రవాణా తదితర అంశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ నిచ్చారు. సైకాలజిస్టులు, వైద్యవిభాగ నిపుణులు, వివిధ ఎన్జీఓలు, స్వచ్ఛంద కార్యకర్తలు, మోటివేషన్ స్పీకర్స్‌తో శిక్షణ ఇస్తున్నారు.

లక్ష్యాలను సాధిస్తాం
సామినేని సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి, ఖమ్మం



ఏటా పడిపోతున్న విద్యార్థుల సంఖ్యను పెంచటం, మరింత నాణ్యమైన విద్యను అందించటం మాలక్ష్యం. ఈనెల ప్రారంభంలో ఉన్నతాధికారులు మూడు రోజులపాటు డీఈఓలకు ఇచ్చిన శిక్షణలో ఇదే అంశాలను వివరించారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రణాళికలు, నిధులు ఇచ్చి అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేస్తోంది.

అమలు చేస్తేనే సార్థకత
కేశవపట్నం రవికుమార్, అకడమిక్ మానిటరింగ్ అధికారి, సమగ్ర శిక్ష



శిక్షణలో అంశాలు,ప్రక్రియలు, కార్యక్రమాలు, చర్యలను పాఠశాల స్థాయిలో నిబద్ధతతో అమలు చేసినప్పుడు మాత్రమే శిక్షణలకు సార్థకత. శిక్షణలు విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ఎంఈఓలు, రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు.

బియ్యం వితరణ

రఘునాథపాలెం, మే 25(ఆంధ్రజ్యోతి): చిమ్మపూడి మాజీ వార్డు సభ్యుడు గోర్రె మాధవరావు ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు జోనబోయిన పాపయ్య 50కేజీల బియ్యాన్ని ఆదివారం వితరణ చేశారు. నాయకులు కోటేరు నర్సిరెడ్డి, గుండ్ల గోవర్ధన్, శశిధర్‌రెడ్డి, తూము సత్యనారాయణ,పొన్నం యాదగిరి, దొంతు వెంకన్న, కణతాల వెంకన్న, పిన్ని మాధవయ్య పాల్గొన్నారు.

జీవాల రైతులకు న్యాయం చేయాలి



బాధితులతో మాట్లాడుతున్న బాగం

ఖమ్మంసంక్షేమ విభాగం, మే25 (ఆంధ్రజ్యోతి): ఆరికోడుతండాలో విషహారం తిని పదుల సంఖ్యలో జీవాలు మృతిచెందగా వాటిని ఖమ్మంలోని పశువైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, నాయకులు దండి సురేశ్ పశువైద్యశాల వద్దకు వెళ్లి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి బాధితులకు సహాయంఅందించాలని డిమాండ్ చేశారు.

సత్తెమ్మకు నివాళి

తిరుమలాయపాలెం, మే25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీపీఎం సీనియర్ నాయకురాలు జూపెడ గ్రామానికి చెందిన తోట సత్తెమ్మ (80) ఆదివారం మృతిచెందారు కొతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆమె మృతి చెందారు. పలువురు నాయకులు ఘన నివాళి అర్పించారు.

అందం.. ఆహ్లాదం

- వేసవిలోను పూల మొక్కల నిర్వహణ భేష్
- నగరం నలు దిక్కులా డివైడర్లలో సోయగం



శ్రీశ్రీ సర్కిల్ రోడ్డులో డివైడర్లు



బల్లేపల్లి రోడ్డులో డివైడర్లు

ఖమ్మంసంక్షేమవిభాగం, మే25(ఆంధ్రజ్యోతి): అభివృద్ధితోపాటుగా సుందరీకరణలో ఖమ్మం గుమ్మం రాష్ట్రంలోని ఇతర మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో ముందు వరసలో ఉంది. వేసవి కాలంలోను డివైడర్లు మొక్కల నుంచి వాక్‌వేలు, పార్కుల్లో మొక్కల సంరక్షణతో పాటుగా క్రమపద్ధతిలో నియంత్రించి నగర ప్రజల్ని ఆహ్లాదంగా ఉండేలా నిర్వాహణ చేపట్టారు. ఖమ్మం నగరం నుంచి వెళ్తున్న జాతీయ, అంతరాష్ట్ర రహదారుల డివైడర్లుకు అందమైన మొక్కలు నిర్వహణ చేపట్టటంతో సుదూర ప్రాంతాలకు ఖమ్మం ద్వారా రవాణా చేసే వారిని అకట్టుకుంటున్నాయి. ఖమ్మం నగరంలోని నలు దిక్కులా మొక్కలను పెంచుతున్నారు. ఆహ్లాదంగా ఖమ్మం నగర పాలక సంస్థ ఉద్యానవన విభాగం అధికారులు చేపట్టి శభాష్ అనిపించుకుంటున్నారు. వీటితో పాటుగా ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న ఖానాపురం, రాస్తోజీనగర్, ప్రశాంతినగర్ వాక్‌వేల వెంట, ధంసలాపురం అల్లీపురం వైకుంఠదామంలోను అందమైన పూల మొక్కలను సంరక్షణ, నిర్వహణ చేపట్టి నగర ప్రజలకు ఆహ్లాదం అందిస్తున్నారు.



రస్తోగినగర్ వాక్‌వే..



అల్లీపురం వైకుంఠధామంలో..

కాంగ్రెస్ నాయకురాలు సంపూర్ణ మృతి



తిరుమలాయపాలెం, మే25(ఆంధ్రజ్యోతి): మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నల్లమల ప్రసాద్ సతీమణి సంపూర్ణ(60) ఆదివారం మృతిచెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధికి ప్రసాద్‌తో పాటు సంపూర్ణ కృషిచేశారు. ప్రజలకు ఏ సమస్యవచ్చినా ఆదుకునే స్వభావం వీరిది. ఆమె భౌతికకాయాన్ని మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, సీపీఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ, కాంగ్రెస్ నాయకులు జి.రాజు, చింతలపుడి రాము, బెల్లం రాము, చీమ లక్ష్మయ్య, బీఆర్ఎస్ నాయకులు కొండబాల వెంకటేశ్వర్లు తదితరులు నివాళులర్పించారు.

త్రివేణి సంగమంలో మేయర్ పూజలు

ఖమ్మంసంక్షేమవిభాగం,మే25(ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమంలో మేయర్ పునుకొల్లు నీరజ,రాంబ్రహ్మం కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం బాసర సరస్వతి పుష్కరాల్లో మేయర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పుష్కరస్నానం చేసి దీపారాధన, ప్రత్యేక పూజలు చేపట్టారు. తర్వాత ఆలయంలో శ్రీకాలేశ్వర, ముక్తీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకృతి విపత్తుల నుంచి ఖమ్మం నగరాన్ని, ప్రజల్ని కాపాడాలని పూజలు చేసినట్లు మేయర్ చెప్పారు.



ప్రభుత్వ వైఫల్యాలపై ఉద్యమించాలి

తిరుమలాయపాలెం, మే25(ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యపరచాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు వేముల సదానంద కోరారు. ఆదివారం తిరుమలాయపాలెంలో పాలేరు డివిజన్ సమావేశంలో మాట్లాడారు. నానాటికి అంతరించిపోతున్న కళలు వాటి విలువలను సామాజిక సేవాదృక్పథం ప్రజల్లో అవగాహన కలిపించాలన్నారు. కళలు అంతరించిపోకుండా కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కవులు, కళాకారులనుప్రభుత్వం గుర్తించాలన్నారు ఈ కార్యక్రమంలో నామా లక్ష్మీనారాయణ, సంద్ర ప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నందిగాం కృష్ణ పాల్గొన్నారు.

మంత్రి ప్రభాకర్‌ను కలిసిన మార్కెట్ చైర్మన్

ఖమ్మంమార్కెట్, మే25(ఆంధ్రజ్యోతి): రవాణా, బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు కలిశారు. మహాత్మ జ్యోతి బాయ్‌పూలేమూవీ రివ్యూ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.



కాంగ్రెస్ నేత హఠాన్మరణం

మధిరరూరల్, మే25(ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మండల కాంగ్రెస్ ఎసీస్సెల్ అధ్యక్షుడు, డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రధాన అనరుచరుడు దార బాలరాజు ఆదివారం ఉదయం గుండె పోటుతో మృతిచెందాడు. బాలరాజు(52) ఉదయం ఏడుగంటల సమయంలో వాకింగ్ చేసి తిరిగి ఇంటికి వచ్చాడు. మంచినీళ్లు తాగుతూనే గుండె భాగంలో నొప్పి వస్తుందని నీరసంగా ఉందని కటుంబసభ్యులకు తెలిపాడు. దీంతో అతని కుమారుడు ద్విచక్రవాహనంపై ఆసుపత్రికి తీసుకొస్తుండగా ఇంటి నుంచి కొద్దిదూరం వచ్చిన తర్వాత ఆత్కూరు గ్రామ సర్కిల్ సమీపంలో బైక్‌పై నుంచి కింద పడి కుప్పకూలిపోయాడు. అక్కడి నుంచి కారులో మధిరలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స కోసం తరలిస్తుండగా ఆసుపత్రికి సమీపంలోకి వెళ్లేసరికి మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మధిర మండల కాంగ్రెస్ రాజకీయాల్లో గత 20 ఏళ్లుగా చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా డిప్యూటీసీఎం మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులకు ప్రధాన అనుచరుడిగా ఉంటూ పార్టీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. బాలరాజు మృతితో కుటుంబ సభ్యుల్లోను, స్వగ్రామంలో, కాంగ్రెస్‌పార్టీ శ్రేణుల్లో తీవ్ర విషాధ చాయలు అలుముకున్నాయి. మృతివార్త తెలుసుకున్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆయన సతీమణి మల్లు నందిని హైదరాబాదు నుంచి ఆత్కూరు గ్రామానికి చేరుకున్నారు బాలరాజు మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. మృతి బాధాకరమని, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

క్రీడలకు దిక్సూచిగా కల్లూరు మినీ స్టేడియం

- క్రీడాకారులతో ఉల్లాసంగా వేసవి శిక్షణ శిబిరం
- పలు క్రీడల్లో సాధన చేస్తున్న బాలబాలికలు
- యోగలో ప్రత్యేక శిక్షణ



కల్లూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మినీ స్టేడియం క్రీడాకారుల సందడితో కొలాహలంగా మారింది. ఈ వేసవి సీజన్‌లో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 8 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలకు పలు క్రీడల్లో ప్రత్యేక నైపుణ్యం గల కోచ్‌లచే శిక్షణ ఇస్తున్నారు. దీంతో మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి బాలబాలికలు ఈ శిక్షణ శిబిరానికి ఎంతో ఆశక్తితో వస్తున్నారు. ఈ క్రీడా మైదానంలో ఇప్పటికే 100, 200, 400, 800 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, వాలిబాల్, బ్యాడ్మింటన్, ఆవుట్ డోర్, ఇండోర్, కబడ్డీ, షటిల్‌తోపాటుగా యోగ సాధనలో కూడ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9 గంటలు, సాయింత్రం వేళ 4 నుంచి 7గంటల వరకు పలు క్రీడల్లో క్రీడాకారులకు కోచ్‌లచే ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇలా గత రెండు సంత్సరాల నుంచి ఈ మినీ స్టేడియంలో ఈ వేసవి శిక్షణ శిబిరం ద్వారా ఎంతో మంది బాలబాలికలు పలు క్రీడల్లో రాణిస్తున్నారు. ఈ వేసవి సీజన్‌లో సుమారు 200 మంది క్రీడకారులు పలు క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. పై విధంగా నాలుగు అంశాల క్రీడలపై ఉచిత శిక్షణ ఇసున్నారు. ఇలా కల్లూరు మినీస్టేడియంలో జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులను తయరు చేయడంలో ఎంతో ప్రాధన్యత సంతరించుకున్నది.

క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దాం
పి.వీరరాఘవయ్య, కల్లూరు మినీ స్టేడియం అడ్మినిస్ట్రేటర్



కల్లూరు క్రీడామైదానంలో వేలమంది క్రీడకాలకు ఉచిత శిక్షణ ఇచ్చాం. జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించేలా కల్లూరుకు ఓగుర్తింపు తెచ్చాం. కల్లూరు పరిసర ప్రాంతాల బాలబాలికలకు, యువతకు, పెద్దవయస్సు గల వారికి క్రీడల నైపుణ్య సాధనలో ఓ వేదికగా ఈ మైదానం మారంది. ప్రభుత్వ సహకారం, జిల్లా క్రీడల యువజనశాఖ అధికారుల సహకారం ఎంతో ఉంది. పలు క్రీడలతో పాటుగా ఆరోగ్య పరిరక్షణలో ఇప్పటి నుంచి అవగాహన కలిగేలా యోగ సాధనలో కూడా ఇక్కడ శిక్షణ ఇస్తున్నాం.

టీడీపీ వైరా పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

వైరా, మే25(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వైరా పట్టణ అధ్యక్షుడిగా బొల్లేపల్లి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పమ్మి అర్జున్‌రావు, ప్రధాన కార్యదర్శి గుడ్ల నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా చావి రవి, తూనాటి సత్యం, గుడ్ల శేషు, కందిమళ్ల శ్రీనివాసరావు, హరిరమేష్, దావులూరి దినేష్, పాసంగుల పాటి శ్యాంసుందర్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావుకు టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం ఆదివారం ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక

కారేపల్లిమే25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాదారం గ్రామంలో కేవీ విద్యానికేతన్‌లో పూర్వ విద్యార్థులు సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. 2004-2005లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ కలయికను ఘనంగా జరుపుకున్నారు. అందరితో కలిసి భోజనాలు చేశారు. విద్యనేర్పిన గురువులకు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కపెర్ల రంగారావు, ఇన్‌చార్జి పగడాల నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రావుల శ్రీను, సంగమూరి రామకృష్ణ, బానోత్ శంకర్, గోరేపాటి వెంకటేశ్వర్లు, తల్లడి మల్లయ్య, ఏజీసీఎం చర్చి పాస్టర్ ఎం.ఎలియా పాల్గొన్నారు.

ఏన్కూరు: ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2004-2005 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల పరిసరాలను కలియతిరుగుతూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.పరస్పరం కరచాలనం చేసుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు 20 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆప్యాయంగా ఒకరినొకరుపలకరించకున్నారు. విద్యాబుద్దులు నేర్పిన గురువులను సన్మానించారు.



కేవీ విద్యానికేతన్ పూర్వ విద్యార్థులు



ఏన్కూరులో పూర్వవిద్యార్థులు



ప్రభుత్వ వైఫల్యాలపై ఉద్యమించాలి

తిరుమలాయపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను కళారూపకంగా ప్రజల తెలుపుతు చైతన్యపరచాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు వేముల సదానంద కోరారు. ఆదివారం తిరుమలాయపాలెంలో పాలేరు డివిజన్ సమావేశంలో మాట్లాడారు. నానాటికి అంతరించిపోతున్న కళలు, వాటి విలువలపై ప్రజలకు అవగాహన కలిపించాలన్నారు. కళలు అంతరించిపోకుండా కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కవులు, కళాకారులను ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో నామా లక్ష్మీనారాయణ, సంద్ర ప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నందిగాం కృష్ణ పాల్గొన్నారు.

త్రివేణి సంగమంలో మేయర్ పూజలు



కుటుంబసభ్యులతో మేయర్

ఖమ్మం సంక్షేమవిభాగం, మే25 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమంలో మేయర్ పునుకొల్లు నీరజ, రాంబ్రహ్మం కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం బాసర సరస్వతి పుష్కరాల్లో మేయర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పుష్కరస్నానం చేసి దీపారాధన, ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఆలయంలో శ్రీకాలేశ్వర, ముక్తీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకృతి విపత్తుల నుంచి ప్రజలను రక్షించాలని పూజలు చేసినట్లు చెప్పారు.

క్రీడలకు దిక్సూచిగా కల్లూరు మినీ స్టేడియం

- క్రీడాకారులతో ఉల్లాసంగా వేసవి శిక్షణ శిబిరం
- పలు క్రీడల్లో సాధన చేస్తున్న బాలబాలికల
- యోగలో ప్రత్యేక శిక్షణ

కల్లూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మినీ స్టేడియం క్రీడాకారుల సందడితో కొలో హలంగా మారింది. ఈ వేసవి సీజన్‌లో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 8 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలకు పలు క్రీడల్లో ప్రత్యేక నైపుణ్యం గల కోచ్‌లచే శిక్షణ ఇస్తున్నారు. దీంతో మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి బాలబాలికలు ఈ శిక్షణ శిబిరానికి ఎంతో ఆశక్తితో వస్తున్నారు. ఈ క్రీడా మైదానంలో ఇప్పటికే 100, 200, 400, 800 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, వాలీబాల్, బ్యాడ్మింటన్, అవుట్ డోర్, ఇండోర్, కబడ్డీ, షటిల్‌తోపాటుగా యోగ సాధనలో కూడ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9 గంటలు, సాయింత్రం వేళ 4 నుంచి 7గంటల వరకు పలు క్రీడల్లో క్రీడాకారులకు కోచ్‌లచే ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇలా గత రెండు సంత్సరాల నుంచి ఈ మినీ స్టేడియంలో ఈ వేసవి శిక్షణ శిబిరం ద్వారా ఎంతో మంది బాలబాలికలు పలు క్రీడల్లో రాణిస్తున్నారు. ఈ వేసవి సీజన్‌లో సుమారు 200 మంది క్రీడకారులు పలు క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. పై విధంగా నాలుగు అంశాల క్రీడలపై ఉచిత శిక్షణ ఇసున్నారు. ఇలా కల్లూరు మినీస్టేడియంలో జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులను తయరు చేయడంలో ఎంతో ప్రాధన్యత సంతరించుకున్నది.



క్రీడాకారులకు శిక్షణనిస్తున్న వీరరాఘవయ్య

క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దాం



పి వీరరాఘవయ్య
కల్లూరు మినీ స్టేడియం అడ్మినిస్ట్రేటర్

కల్లూరు క్రీడా మైదానంలో కొన్ని సంత్సరాలుగా వేలమంది క్రీడకాలకు ఉచిత శిక్షణ ఇచ్చాం. జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించేలా కల్లూరుకు ఓ గుర్తింపు తెచ్చాం. కల్లూరు పరిసర ప్రాంతాల బాలబాలికలకు, యువతి, యువకులకు, పెద్ద వయస్సు గల వారికి క్రీడల నైపుణ్య సాధనలో ఓ వేదికగా ఈ మైదానం మారంది. ప్రభుత్వ సహకారం, జిల్లా క్రీడల యువజనశాఖ అధికారుల సహకారం ఎంతో ఉంది. పలు క్రీడలతో పాటుగా ఆరోగ్య పరిరక్షణలో ఇప్పటి నుంచి అవగాహన కలిగేలా బాలబాలికు యోగ సాధనలో కూడా ఇక్కడ శిక్షణ ఇస్తున్నాం.



స్నేహితుడికి నిత్యావసరాలు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

ఆపదలో ఆదుకున్న ఆప్తమిత్రులు

ముదిగొండ, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాణాపురం గ్రామానికి చెందిన వేముల వెంకటేష్, కర్నే విజయ్‌లు అనారోగ్యంతో బాధపడుతూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారనే విషయం తెలుసుకున్న బాల్యంలో వారితో కలిసి పదోతరగతి వరకు చదువుకున్న పూర్వవిద్యార్థులు ఇబ్బందుల్లో ఉన్న మిత్రులకు రూ.13వేలతో కొన్న నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. ఇబ్బందుల్లో తమను ఆదుకోవడం పట్ల స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు.

విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై రైతులకు అందించాలి

కొణిజర్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఎరువులను, విత్తనాలను ప్రభుత్వమే సబ్సిడీపై రైతులకు అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు షేక్ ఖాసీం డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కొద్ది రోజుల్లో వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతుందని, రైతులకు విత్తనాలు అవసరం ఉందని, రైతులు నకిలి విత్తనాల బారిన పడకుండ ప్రభుత్వమే నాణ్యమైన విత్తనాలను రైతులకు పంపిణీ చేయాలన్నారు. గ్రామాలలో కల్తీవిత్తనాలు వస్తున్నాయని ప్రచారం జోరుగా సాగుతున్నందున నకిలి విత్తనాలను అరికట్టాలని కోరారు. కార్పొరేట్ విత్తన కంపెనీలు గ్రామాలలో ఏజెంట్‌లను ఏర్పాటు చేసుకుని రైతులకు నకిలీ విత్తనాలను అంటగడుతున్నారని తెలిపారు. గ్రామాలలో విత్తనాలు విక్రయాలు జరుగుతున్న అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నకిలీ విత్తనదారులపై పీడీయాక్టు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాయల, పువ్వాళ్ల

ముదిగొండ, మే 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎడవల్లిలో పురాతన లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఈ నెల 28న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారు. శంకుస్థాపన ఏర్పాట్లను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆదివారం పరిశీలించారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, నాయకులు పసుపులేటి దేవేంద్రం, సామినేని వెంకటయ్య, వీరబాబు, రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణలను తొలగించాలి

వేంసూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం నుంచి కుంచపర్తి వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి ఆక్రమణలకు గురైందని పలువురు రైతులు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారులకు పిర్యాదు చేశారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణకు గురికావడంతో తమ పొలాల్లోని వృథా నీరు బయటకు పోకుండా కొంతమంది ఆక్రమణదారులు అడ్డుకట్టలు వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో తమ పొలాల్లోని నీరు బయటకు పోకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని రైతులు కోరారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డాక్టర్ రామనాథం

వైరా, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వైరా పట్టణ అధ్యక్షుడిగా బొల్లేపల్లి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పమ్మి అర్జున్‌రావు, ప్రధాన కార్యదర్శి గుడ్ల నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా చావి రవి, తూనాటి సత్యం, గుడ్ల శేషు, కందిమళ్ల శ్రీనివాసరావు, హరి రమేష్, దావులూరి దినేష్, పాసంగులపాటి శ్యాంసుందర్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావుకు టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఆదివారం ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావు, మండల అధ్యక్షుడు కిలారు సురేందర్, నాయకులు మందడపు మధుసూదన్‌రావు, అమరనేని వేణు, సూర్యదేవర వెంకటకృష్ణ, మోత్కూరి వెంకటేశ్వరరావు, మద్దినేని రామారావు, చావా కాంతారావు, రవి, కొమ్మిడిశెట్టి శ్రీధర్, కోటదాసు, వడ్డేబోయిన అయ్యప్ప, నారాయణ పాల్గొన్నారు.

మసీదు కమిటీ అధ్యక్షుడిగా మస్తాన్

తల్లాడ, మే 25 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మసీదు కమిటీ అధ్యక్షుడుగా షేక్ మస్తాన్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక మసీదులో మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ యూసుబ్ ఆధ్వర్యంలో జరిగిన కమిటీ సమావేశంలో అధ్యక్షుడుగా మస్తాన్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా షేక్ నిజాముద్దీన్, కమిటీ సభ్యులుగా షేక్ మెహరజ్, సైదా, బడేమియా, నాగుల్‌మీరా, బాబు, బాబా, జాన్‌బాబు, మున్నా , యాకుబ్, జాక్రియాను ఎన్నుకున్నారు.

మౌలిక భౌతికకాయానికి నివాళి



మౌలిక భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, మే 25 (ఆంధ్రజ్యోతి): కరెంట్ ప్రమాదంలో మృతిచెందిన వైరా మునిసిపాలిటీ 11వ వార్డు సోమవరం ప్రాంతానికి చెందిన ఆది మౌలిక భౌతికకాయానికి ఆదివారం రాత్రి ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నివాళులర్పించారు. జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు ఆది ఆనందరావు చిన్నకోడలు అయిన మౌలిక హైదరాబాద్‌లో ప్రమాదవశాత్తూ కరెంట్ వైర్ తెగిపడి మృతిచెందింది. ఆమె భౌతికకాయాన్ని సోమవరంలోని స్వగ్రామానికి ఆదివారం తీసుకువచ్చారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నాయకులు కట్ల రంగారావు, సంతోష్, దొబ్బల సౌజన్య, దార్న రాజశేఖర్, పుచ్చకాయల వీరభద్రం, కొల్లి రమేష్, పాలేటి నర్సింహారావు, పమ్మి అశోక్ తదితరులు నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన ఫార్మాసిస్టుల కార్యవర్గం

ఎర్రుపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీనవోలు గ్రామంలో నాలెడ్జ్ సెంటర్‌లో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఫార్మసిస్ట్‌ల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆ సంఘం అధ్యక్షుడుగా కర్నాటి సుధాకర్‌రెడ్డి , ఉపాధ్యక్షులుగా శీలం చిన్న హనుమంతరెడ్డి, మానికొండ కృష్ణప్రసాద్, కార్యదర్శిగా పత్తిపాటి విజయభాస్కరరావు, ట్రెజరర్‌గా కేతేపల్లి ఫణికుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మల్లవరపు గోపాలరావు, బండారు ఆంజనేయులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫార్మాసిస్ట్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సంఘం కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల ఫార్మాసిస్ట్‌లు పాల్గొన్నారు.

లక్ష్మీతాయారు కుటుంబానికి పరామర్శ



లక్ష్మీతాయారుకు నివాళులర్పించిన సంబాని

సత్తుపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం బేతుపల్లిలోని లక్ష్మీతాయారు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్ ఆదివారం పరామర్శించారు. లక్ష్మీతాయారు ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. ఆమె ఇంటికి వెళ్లిన మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్ లక్ష్మీతాయారు కుమారుడు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివావేణు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. సంబాని వెంట కొర్రపాటి సాల్మన్‌రాజు, గోళ్ల అప్పారావు, పెద్దబోయిన దుర్గాప్రసాద్, తోట రాజేష్, వెలిశాల వెంకటాచారి, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, నరసింహారావులున్నారు.

కొలతలు లేకుండా ఉపాధి పనులుండాలి



కారేపల్లిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఉపేందర్

కారేపల్లి మే 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కొలతలు పద్దతి రద్దుచేసి రోజువారి కూలీ రూ.600 చెల్లించాలని వ్యవసాయకార్మిక సంఘం నాయకుడు కేసగాని ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని గాంధీ నగరంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్బంగా ఉపేందర్ మాట్లాడుతూ.. వ్యవసాయ పనులులేని సమయంలో కుటుంబానికి అసరాగా ఉంటుందని పేదలు ఉపాధి పనికివస్తున్నారన్నారు. ఈ కా్రక్రమంలో ఈసం వెంకటేశ్వర్లు, ఎరిపోతు ముత్యం, గోవర్ధనగిరి దశరధ్, ఈసం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయరూ..

- మెరుగైన సేవలందించడంలో..
- వేధిస్తున్న సిబ్బంది కొరత



ఖాళీ పోస్టులతో నడుస్తున్న బోనకల్ పీహెచ్‌సీ ఇదే

బోనకల్, మే 25 (ఆంధ్రజ్యోతి): బోనకల్ పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి 24 గంటల పాటు ఆసుపత్రిలో వైద్య సేవలందించేలా చూడాలని ఎన్నాళ్ల నుంచో మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు. కాని ఇంత వరకు అప్‌గ్రేడ్ కాకపోవడంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పీహెచ్‌సీని తెరచి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. మండలంలో 42వేల జనాభా ఉంది. నిత్యం ప్రజలు ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. గత కొన్ని నెలలుగా పీహెచ్‌సీలో ఖాళీ పోస్టులు భర్తి చేయకపోడంతో వైద్య సేవల్లో అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా పీహెచ్‌సీలో సీహెచ్‌వో, హెల్త్ అసిస్టెంట్ పోస్టులతో పాటు మోటమర్రి, గోవిందాపురం(ఎల్), పెద్దబీరవల్లి, బోనకల్ సర్కిల్ పరధిలో 5 ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆసుపత్రిలో వైద్యాధికారికి ప్రతిరోజు ప్రజలకు ఓపీ సేవలతో పాటు సమావేశాలు, ఆసుపత్రి నిర్వహణ బాధ్యతలను నిర్వర్తిస్తుంటారు. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో సీజనల్ జ్వరాలతో ప్రజలు పీహెచ్‌సీకి వస్తుంటారు. మెరుగైన వైద్య సేవలు అందించడంలో బోనకల్ పీహెచ్‌సీకి జిల్లాలో మంచి పేరుంది. ఖాళీ పోస్టులను వెంటనే భర్తి చేస్తేనే ప్రజలకు ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్య సేవలందుతాయని పలువురు బావిస్తున్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నేత హఠాన్మరణం

- నివాళులర్పించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



మధిరరూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మండల కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రధాన అనరుచరుడు దార బాలరాజు ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. బాలరాజు(52) ఉదయం ఏడుగంటల సమయంలో వాకింగ్ చేసి తిరిగి ఇంటికి వచ్చాడు. మంచినీళ్లు తాగుతూనే గుండె భాగంలో నొప్పి వస్తుందని నీరసంగా ఉందని కటుంబసభ్యులకు తెలిపాడు. దీంతో అతని కుమారుడు ద్విచక్రవాహనంపై ఆసుపత్రికి తీసుకొస్తుండగా ఇంటి నుంచి కొద్ది దూరం వచ్చిన తర్వాత ఆత్కూరు గ్రామ సర్కిల్ సమీపంలో బైక్‌పై నుంచి కింద పడి కుప్పకూలిపోయాడు. అక్కడి నుంచి కారులో మధిరలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స కోసం తరలిస్తుండగా ఆసుపత్రికి సమీపంలోకి వెళ్లేసరికి మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మధిర మండల కాంగ్రెస్ రాజకీయాల్లో గత 20 ఏళ్లగా చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా డిప్యూటీసీఎం మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులకు ప్రధాన అనుచరుడిగా ఉంటూ పార్టీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. బాలరాజు మృతితో కుటుంబసభ్యుల్లోను, స్వగ్రామంలో, కాంగ్రెస్‌పార్టీ శ్రేణుల్లో తీవ్ర విషాధ చాయలు అలుముకున్నాయి. మృతివార్త తెలుసుకున్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆయన సతీమణి మల్లు నందిని హైదరాబాదు నుంచి ఆత్కూరు గ్రామానికి చేరుకున్నారు బాలరాజు మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. బాలరాజు మృతి బాధాకరమని, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోటా రాంబాబు, నాయకులు జవ్వాజి ఆనందరావు, మొండితోక జయకర్, టీడీపీ, సీపీఎం, సీపీఐ, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు బాలరాజుకు నివాళులర్పించారు. బాలరాజు అంతిమయాత్రకు గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయుకలు కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కారేపల్లి మే 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాదారం గ్రామంలో కేవీ విద్యానికేతన్‌లో పూర్వవిద్యార్థులు సమ్మేళన కార్యక్రమం అదివారం నిర్వహించారు. 2004-2005 లో పదోవతరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ కలయికను ఘనంగా జరుపుకున్నారు. అందరితో కలిసి బోజనాలు చేశారు. విద్యనేర్పిన గురువులకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాడెంట్ కొపెర్ల రంగారావు, ఇన్‌చార్జి పగడాల నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రావులశ్రీను, సంగమూరి రామకృష్ణ, బానోత్ శంకర్, గోరేపాటి వెంకటేశ్వర్లు, తల్లడి మల్లయ్య, ఏజీసీఎం చర్చి పాస్టర్ ఎం.ఎలియా పాల్గొన్నారు.



కేవీ విద్యానికేతన్ పూర్వ విద్యార్థులు



ఏన్కూరులో పూర్వవిద్యార్థులు

ఏన్కూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2004-2005 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల పరిసరాలను కలియతిరుగుతూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పరస్పరం కరచాలనం చేసుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు 20 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆప్యాయంగా ఒకరినొకరుపలకరించకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్దులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

ముగిసిన వేసవి శిక్షణ

కొణిజర్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తనికెళ్ల ఉన్నత పాఠశాలలో గడచిన 15 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిభిరం ఆదివారం ముగిసింది. శిక్షణ కాలంలో విద్యార్థులకు ప్రతి రోజు డ్రాయింగ్, డ్యాన్స్, యోగా, కోలాటం, చెస్, క్యారమ్స్, కంప్యూటర్‌ను నేర్పించటం జరిగింది. క్యాంపు ద్వారా తమకు ఎన్నో విషయాలు అవగాహన కల్పించడం జరిగిందని విద్యార్థులు తెలిపారు. ముగింపు సందర్బంగా మండల విద్యాశాఖాధికారి అబ్రహం పాల్గొని శిక్షణలో విద్యార్థులు నేర్చుకున్న అంశాను తెలుసుకున్నారు. క్యాంపు ద్వారా తెలుసుకున్న అంశాలను భవిష్యత్తులో ఉపయోగించుకోవాలని సూచించారు.





ఉపాధ్యాయుడి సమక్షంలో డ్రాయింగ్, యోగా ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

తరుగుతో అన్నదాతకు తీరని అన్యాయం

తల్లాడ, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ద్వారా జరుగుతున్న ధాన్యం అమ్మకాలలో అన్నదాతలు దగా పడుతున్నారు. రైస్ మిల్లర్ల చేతిలో తరుగు భారం వల్ల అన్నదాతలకు తీరని అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వ నిబంధన మేరకు 15శాతం లోపు తేమ ఉన్న, తాలులేని ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి తూకం వేసిన తర్వాత ధాన్యంలో తరుగు పేరుతో కోత విధించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని కుర్నవల్లి గ్రామానికి చెందిన పోతురాజు కృష్ణ, తేళ్లూరి శ్రీనివాసరావు, అయిలూరి లింగారెడ్డి, అయిలూరి రామిరెడ్డి అనే నలుగురు రైతులు సాధారణ రకం ధాన్యాన్ని కుర్నవల్లిలోని ప్రభుత్వ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. ఈ నలుగురు రైతులకు సంబంధించి 40కిలోల చొప్పున 731 బస్తాల ధాన్యాన్ని తూకం వేశారు. ఈనెల 17న కుర్నవల్లిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ఒకే లారీలో 731 బస్తాల ధాన్యాన్ని వరంగల్‌జిల్లా, తీమ్మాపూర్ లోని సాయిసంతోష్ రైస్ ఇండస్ట్రీస్ మిల్లుకు తరలించారు. రైసు మిల్లులో ధాన్యం దించే సమయంలో తూకం వేసి చాలా రోజులైందని, ధాన్యం బరువు తగ్గిందని, తాలు ఉందని కారణాలు చూపుతూ 731 బస్తాల ధాన్యానికి గాను తరుగు పేరిట కోత విధించి 669 బస్తాల నికరంగా ధాన్యాన్ని రైస్‌మిల్లరు నిర్ధారించారు. ధాన్యం క్వింటాకు 9కిలోల చొప్పున తరుగు పేరుతో మిల్లర్లు కోత విధించారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకం వేసే వరకే రైతుల బాధ్యతని, అధికారులు చెబుతున్నా మరోవైపు కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు కుమ్మక్కై తరుగు పేరుతో అన్యాయం చేస్తున్నారు.

తరుగు వల్ల తీవ్రంగా నష్టపోయా

పోతురాజు కృష్ణ రైతు కుర్నవల్లి

ప్రభుత్వ నిబంధనల మేరకు 15శాతం లోపు తేమ తాలులేని సాధారణ రకం ధాన్యం 365 బస్తాలు ఐకేపీ కేంద్రంలో అమ్మాను. తూకం వేసిన ధాన్యాన్ని తిమ్మాపూర్ సాయిసంతోష్ రైస్ఇండస్ట్రీస్ మిల్లులో దిగుమతి చేసే సమయంలో తరుగు పేరుతో 3.80 క్వింటాళ్ల ధాన్యం కోతవిధించడం వల్ల తీవ్రంగా నష్టపోయాను.

తరుగుతో 62బస్తాలు నష్టపోయాం

అయిలూరి లింగారెడ్డి రైతు

మా నలుగురు రైతులకు సంబంధించి 731బస్తాల ధాన్యానికి తరుగు పేరుతో రైస్‌మిల్లర్లు 62బస్తాల కోత విధించారు. ఈ విషయమై మాకు కనీస సమాచారం కూడా లేకుండా ఇష్టానుసారంగా కోత విధించి మాకు తీరని అన్యాయం చేశారు.